పారిశుధ్య కార్యక్రమాలు నిరంతరం కొనసాగాలి 6లో..

మండల పరిషత్‌కు డిప్యూటేషన్ల గండం 6లో..



పచ్చ బంగారం ధగధగలు

- పసుపు క్వింటాలుకు రూ. 10 వేల పైనే..
- పంట పండించే రైతుల్లో ఆనందం
- సీజన్ చివరి వరకు నిలకడగా ఉండేనా...
- ధర మరింత పెరిగే అవకాశం ఉందంటున్న వ్యాపారులు

జగిత్యాల, ఫిబ్రవరి 15 (ఆంధ్రజ్యోతి): ప్రస్తుత సీజన్‌లో పసుపు పంట ధర ఆశాజనకంగా ఉండడంతో రైతుల ఆశలు చిగురిస్తున్నాయి. కొన్నేళ్లు గా పసుపు పంటకు ధర లేక పోవడంతో ప్రస్తుత సంవత్సరం పంట సాగును రైతులు కొంత తగ్గించారు. సాగు చేసిన పంటకైనా ధర దక్కుతుందా...అనే అనుమానాలు సైతం వ్యక్తం చేశారు. రెండ్రోజులుగా రైతులు పసుపు పంటను జిల్లాలోని మెట్‌పల్లి వ్యవసాయ మార్కెట్‌తో పాటు నిజామాబాద్ యార్డుకు తరలిస్తున్నారు. మార్కెట్‌లో ధర పసుపు కొమ్ముకు క్వింటాలుకు రూ. 10 వేల నుంచి రూ. 11 వేల వరకు, మండ (దుంప)కు క్వింటాలుకు రూ. 9 వేల నుంచి రూ. 10 వేలు పలుకుతోంది. పంట ధర క్వింటాలుకు రూ. 10 వేల కంటే తగ్గితే నష్టపోయే ప్రమాదం ఉందని రైతులు చెబుతున్నారు. దీర్ఘకాలిక పంటైన పసుపు సాగుకు ఎక్కువ పెట్టు బడి పెట్టాల్సి ఉంటుందన్నారు. ప్రస్తుతమున్న ధర సీజన్ చివరకు ఉంటుందా లేదా అనుమానాలు సైతం రైతులు వ్యక్తం చేస్తున్నారు.

ఇప్పుడిప్పుడే మార్కెట్‌కు పసుపు...

ఇప్పుడిప్పుడే మార్కెట్‌కు వస్తున్న పసుపు మరో వారం రోజుల్లో భారీగా రానున్నట్లు అంచనా ఉంది. ఆ సమయంలో పసుపు ధరను తగ్గిస్తారనే ఆందోళన రైతులను వెంటాడుతోంది. ఇదిలా ఉండగా పసుపు బోర్డు ఏర్పాటుకు కార్యచరణ కొనసాగుతోందని తాజాగా ఎంపీ అర్వింద్ నిజా మా బాద్ మార్కెట్ యార్డును సందర్శించిన సందర్భంగా పేర్కొన్నారు. అంతే గాకుండా రానున్న రోజుల్లో పసుపు పంట క్వింటాలుకు రూ. 20 వేల వరకు ధర పలుకుతుందని అన్నారు. దీంతో పసుపు రైతుల్లో ఆశలు మరింత చిగురిస్తున్నాయి.

కొన్నేళ్లుగా రైతులకు నిరాశ...

కొన్నేళ్లుగా రైతులను పసుపు పంట నిరాశకు గురి చేస్తోంది. ప్రస్తుత సీజన్‌లో పసుపునకు ఉన్న ధర రైతుల్లో ఆనందాన్ని నింపుతోంది. దిగుబ డులు నేల స్వభావాన్ని బట్టి కాస్త అటు ఇటుగా ఉన్నా ధర మాత్రం ఊర టనిస్తోంది. సరాసరి క్వింటాలుకు రూ. 10 వేలకు పైగానే దక్కుతుండ డంతో సాగుదారులు సంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. గత అయిదు, ఆరు సంవత్సరాలుగా గిట్టుబాటు కాకపోవడంతో సాగు విస్తీర్ణం తెలంగాణతో పాటు జగిత్యాల జిల్లాలోనూ తగ్గింది. గతంలో సుమారు 45 వేల ఎకరా లకు పైగా పసుపు సాగు అవుతుండేది. ప్రస్తుతం సుమారు 35 వేల ఎకరాల్లో రైతులు పసుపును సాగు చేస్తున్నారు. పసుపు సాగు ఎకరానికి రూ. 80 వేల నుంచి రూ. 1.20 లక్షల వరకు రైతులు పెట్టుబడి పెడుతున్నారు. సుమారు తొమ్మిది నెలల పాటు వ్యయ ప్రయాసలకోర్చి సాగు చేస్తున్న కర్షకులపై వాతావరణ ప్రభావం కూడా గడిచిన రెండు, మూ డు సీజన్‌లలో పడింది. అధిక వర్షాలతో దిగుబడులు సగానికి తగ్గిపోయాయి. పసుపు తగ్గడంతో మార్కెట్‌లో రానున్న రోజుల్లో మరింత డి మాండ్ ఉంటుందన్న అంచనా ఉంది. ఈ క్రమంలోనే వ్యాపారులు ధర పెట్టేందుకు ముందుకు వస్తున్నట్లు సంబంధిత వర్గాలు అంటున్నాయి.

నాణ్యతకు ఆదరణ...

మార్కెట్‌కు కొత్త పంట రావడం ఇటీవల ప్రారంభమైంది. ఎండలు అంతగా లేకపోవడంతో తేమ శాతం అధికంగా ఉన్న పంట మార్కెట్‌కు వస్తున్నట్లు సంబంధిత వర్గాలు అంటున్నాయి. కొందరు ఇప్పటికే సుమారు 20 శాతానికి పైగా తేమతో తెస్తున్నట్లు వ్యాపారులు అంటున్నారు. ఈ విషయంలో అవగాహన కార్యక్రమాలు నిర్వహించక పోవడంతో మార్పు కనిపించడం లేదని వ్యాపార వర్గాలు పేర్కొంటున్నాయి. ఉడికించి, ఆరబెట్టి, పాలిషింగ్ చేసి తెచ్చిన పంటకు మంచి ధర లభిస్తుందని అధికారులు చెబుతున్నారు. మెట్‌పల్లి మార్కెట్‌లో ప్రస్తుతం నాణ్యతతో తీసుకవచ్చిన కాడి పసుపు క్వింటాలుకు రూ. 11,888 గరిష్ఠ ధర, గోల పసుపు క్వింటాలుకు గరిష్ఠ ధర రూ. 11,666, చూర పసుపు క్వింటాలుకు గరిష్ఠ ధర రూ. 11,111 పలికింది.


మెట్‌పల్లిలో పసుపు కొనుగోళ్లు జరుపుతున్న వ్యాపారులు


మార్కెట్‌కు వచ్చిన పసుపు

2007లో ఇలాంటి పరిస్థితి...

గతంలో ఉమ్మడి రాష్ట్రంలో అప్పటి ప్రభుత్వం పసుపు పంటను మార్క్‌ఫెడ్ ద్వారా కొనుగోలు చేయడంతో క్వింటాలుకు గరిష్ఠంగా రూ. 17 వేల వరకుధర పలికింది. రెండు మూడేళ్లు అదే ధర కొనసాగడంతో రైతులకు మంచి రాబడులు వచ్చాయి. తదుపరి పసుపు ధరల్లో వ్యత్యాసం చోటు చేసుకుంది. రైతులకు గిట్టుబాటు ధరలు అందలేదు. దాదాపు పదిహేను సంవత్సరాల కిందటి ధరలు ప్రస్తుత సీజన్‌లో పునరావృతం అవుతాయని రైతులు ఆశభావం వ్యక్తం చేస్తున్నారు. పలు సీజన్‌లలో పసుపునకు గిట్టుబాటు ధరలు లేక పంటను క్వింటాలుకు రూ. 4 వేలకే అమ్ముకోవాల్సిన పరిస్థితి సైతం రైతులకు ఎదురైంది. ప్రస్తుతం సీజన్ ప్రారంభంలో క్వింటాలుకు రూ. 10 వేల పైన ధర పలుకుతుండడంతో రైతుల ఆశలు చిగురుస్తున్నాయి.

సీజన్ చివరి వరకు కొనసాగేనా..

పసుపునకు ప్రస్తుతం ఉన్న ధరలు సీజన్ చివరి వరకు కొనసాగు తాయా అన్న అనుమానాలు రైతుల్లో వ్యక్తం అవుతోంది. మార్కెట్‌కు భారీగా పసుపు వచ్చిన సందర్భాల్లో వ్యాపారులు సిండికేట్‌గా ఏర్పడి ధరలు దించుతున్నారన్న ఆరోపణలు వ్యక్తం అవుతున్నాయి. సీజన్ చివరి వరకు ధర ఇలానే ఉంటే బాగుంటుందని అన్నదాతలు అభిప్రాయప డుతు న్నారు.. కొన్ని రోజులు అయితే ఎక్కువ మొత్తంలో పసుపు మార్కెట్‌కు వస్తుందని, ధరలు తగ్గకుండా జాగ్రత్తలు తీసుకోవాలన్న అభిప్రాయాలు రైతులు వ్యక్తం చేస్తున్నారు. పసుపు పంటకు నిలకడైన ధర ఉంటే రైతులకు నష్టాలు రావని, ప్రస్తుత సంవత్సరం పసుపు పంటకు ధర ఆశా జనకంగానే ఉందంటున్నారు.

గుండెపోటుతో బాలుడి మృతి


హర్షిత్(ఫైల్ ఫొటో)

జగిత్యాలరూరల్, ఫిబ్రవరి 15 : మండలంలోని ధరూర్ గ్రామానికి చెందిన బాలె హర్షిత్ (09) గురువారం తెల్లవారుజామున గుండెపోటుతో మృతిచెంది నట్లు గ్రామస్థులు తెలిపారు. స్థానికుల కథనం ప్రకారం హర్షిత్ ధరూర్ గ్రామంలో గల మౌంట్ కార్మెల్ హై స్కూల్‌లో 3వ తరగతి చదువుతున్నాడు. బాలుడి కుటుంబసభ్యులు నాలుగు రోజుల క్రితం తిరుపతి వెంకన్న దర్శనానికి వెళ్లి తిరిగివచ్చారు. మార్గమధ్యలో ప్రయాణంలో బాలుడికి వాంతులు కావడంతో స్థానిక వైద్యుడిద్వారా ప్రథమచికిత్స అందించారు. ఇంటికి చేరుకున్న బాలుడు తీవ్ర అస్వస్థతకు గురికావడంతో కుటుంబసభ్యులు ప్రభుత్వ ఆస్పత్రికి తరలించగా గుండె బలహీనంగా కొట్టుకుంటుందని వైద్యులు గుర్తించారు. చికిత్స అందించే లోపే మృతి చెందాడని స్థానికులు, బాలుడి బంధువులు తెలిపారు. ఈసంఘటన ధరూర్ గ్రామంలో తీవ్ర విషాదాన్ని నింపింది. బంధువుల రోదనలు మిన్నంటాయి. బాలుడి కుటుంబాన్ని మాజీ ఏఎంసీ ఛైర్మన్ కొలుగూరిదామోదర్‌రావు, ప్యాక్స్‌వైస్‌ఛైర్మన్ శీలం సురేందర్, మాజీ సర్పంచ్ ప్రభాకర్, పలువురు నాయకులు పరామర్శించారు.

రాష్ట్రంలో అత్యధికంగా జగిత్యాలలో ఇళ్ల నిర్మాణం

ఎమ్మెల్యే సంజయ్‌కుమార్


అసెంబ్లీలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే

జగిత్యాల, ఫిబ్రవరి 15 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్రంలో ఎక్కడలేనివిధంగా జగిత్యాలలో 4520 ఇండ్ల నిర్మాణాలు గత బీఆర్ఎస్ హయాంలోనే చేపట్టామని జగిత్యాల ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్‌కుమార్ అసెంబ్లీలో ప్రస్తావించారు. డబుల్‌బెడ్ రూమ్ ఇండ్లకు కరెంట్, డ్రైనేజీ, రహదారులు, మౌలిక సదుపాయాల కోసం నిధులు మంజూరైనట్లు తెలిపారు. టీయూఎఫ్ఐడీఎస్ నిధులు డబుల్ బెడ్‌రూమ్ ఇండ్లకు కేటాయించరాదన్న విషయం తన దృష్టికి వచ్చిందని, జగిత్యాల పట్టణపేదరిక నిర్మూలన కోసం కేటాయించిన కాలనీ కాబట్టి నిధులు మంజూరు చేయాలని కోరారు. గతంలో మాదిరిగా ఎమ్మెల్యేలకు ఏసీడీపీ నిధులు కేటాయంచాలన్నారు. నియోజకవర్గంలో ఎమ్మెల్యేలకు ప్రోటోకాల్ అమలు చేయాలని కోరారు.

ఘనంగా భోగ్ బండార్ వేడుకలు


భోగ్ బండార్ కార్యక్రమంలో పాల్గొన్న నాయకులు

రాయికల్, ఫిబ్రవరి 15: మండలంలోని అల్యా నాయక్ తండాలో సద్గురు సంత్ శ్రీ సేవాలాల్ మహారాజ్ 285వ జయంతి సందర్భంగా గురువారం భోగ్ బండార్ కార్యక్రమం నిర్వహించారు. తండావాసులు, మహిళలు, యువ కులు, పెద్ద సంఖ్యలో పూజలు నిర్వహించి మొక్కులు చెల్లించుకున్నారు. ఎంపీపీ లావుడ్య సంధ్యారాణిసురేందర్ నాయక్, ఎంపీడీవో చిరంజీవి, తహసీల్దార్ ఖయ్యూం, వైస్ ఎంపీపీ మహేశ్వర్‌రావు, పీఆర్ఏఈ ప్రసాద్, సూపరింటెండెంట్ వేణు, ఆల్యా నాయక్ తండా పెద్ద మనుషులు దుప్య నాయక్, రాజన్న, స్వామి నాయక్, రాజేష్ నాయ క్, బిక్య నాయక్ పాల్గొన్నారు.

క్రీడలు మానసికోల్లాసాన్ని కలిగిస్తాయి

తహసీల్దార్ ఎంఏ ఖయ్యూం

రాయికల్, ఫిబ్రవరి 15: క్రీడలు మానసికోల్లాసాన్ని కలిగిస్తాయని రాయికల్ తహసీల్దార్ ఎంఏ ఖయ్యూం అన్నారు. మండలంలోని అల్లీపూర్ గ్రామంలో ఎంబారి గంగారెడ్డి-లక్ష్మి స్మారక విలేజ్ లెవల్ టోర్నమెంట్‌ను వారి కుమారుడు, తాజా మాజీ వార్డు సభ్యుడు ఎంబారి సురేష్ నిర్వహించగా గురువారం ముగిశాయి. తహసీల్దార్ ఖయ్యూంతో పాటు డాక్టర్ గురువారెడ్డి, డాక్టర్ మల్లారెడ్డి హాజరై విజేతలకు బహుమతులు అందజేశారు. వైద్యులు వివేకానంద స్పోర్ట్స్ క్లబ్‌కు రూ.30 వేల ఆర్థిక సహాయాన్ని అందజేశారు. అనంతరం సామాజిక సేవకుడు మున్నా డాక్టరేట్ అందుకోగా ఆయనను ఘనంగా సన్మానించారు. ఎద్దండి భూమారెడ్డి, గోపి మాధవిరాజరెడ్డి, వెంకటేశ్వర్‌రావు, మండరవి, పొరండ్ల రాజారెడ్డి, వివేకానంద స్పోర్ట్స్ క్లబ్ సభ్యులు, గ్రామస్థులు పాల్గొన్నారు.

ఎస్పీని కలిసిన మెట్‌పల్లి డీఎస్పీ


ఎస్పీకి మొక్క అందిస్తున్న మెట్‌పల్లి డీఎస్పీ

జగిత్యాల టౌన్, ఫిబ్రవరి 15 : మెట్‌పల్లి డీఎస్పీగా ఉమామహేశ్వర్ రావు ఇటీవల నియమితులు కాగా గురువారం బాధ్యతలు చేపట్టారు. అనంతరం ఎస్పీ సన్ ప్రీత్ సింగ్‌ను మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్చం అందజేశారు. శాంతి బద్రతల పరిరక్షణే ధ్యేయంగా పనిచేస్తానని డీఎస్పీ మాట్లాడారు.

గంజాయి నిర్మూలనకు సహకరించాలి

రాయికల్, ఫిబ్రవరి 15: గంజాయి నిర్మూలనకు కృషి చేయాలని రాయికల్ తహసీల్దార్ ఎంఏ ఖయ్యూం అన్నారు. మండలంలోని ఆలూరు గ్రామంలో ప్రత్యేక పారిశుధ్య వారోత్సవాల్లో భాగంగా గురువారం మద్యపానం, గుట్కా, బీడీ, సిగరెట్లు, గంజాయి నిర్మూలనకు గ్రామస్థులకు అవగాహన కల్పించి నిర్మూలనకు సహకరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ మెక్కొండ రాంరెడ్డి, వెంకటేష్, నర్సయ్య, సతీష్, మల్లారెడ్డి, కార్యదర్శి రాజశ్రీ, గోదావరి తదితరులు పాల్గొన్నారు.

జాతీయ స్థాయి కోచ్‌గా గణేష్

ధర్మపురి, ఫిబ్రవరి 15: ధర్మపురి మండలంలోని తుమ్మెనాల గ్రామానికి చెందిన మామిడిపెల్లి గణేష్ అంతర్జాతీయ కిక్ బాక్సింగ్ పోటీల్లో జాతీయ స్థాయి కోచ్‌గా ఎంపికయ్యారు. ఈ నెల 7 నుంచి 11 వరకు న్యూ ఢిల్లీలోని ఇందిరా గాంధీ స్టేడియంలో జరిగిన అంతర్జాతీయ కిక్ బాక్సింగ్ పోటీల్లో రాష్ట్ర జట్టుకు కోచ్‌గా వ్యవహరించారు. జాతీయ స్థాయి కోచ్‌గా శిక్షణ పూర్తి చేసుకొని, సర్టిఫికెట్ సాధించినట్లు కిక్ బాక్సింగ్ చీఫ్ ఇన్‌స్ట్రక్టర్ కస్తూరి ప్రవీణ్ తెలిపారు. గణేష్‌ను వాకో ఇండియా ప్రెసిడెంట్ సంతోష్ అగర్వాల్, ఇండియా చీఫ్ కోచ్ సురేష్‌బాబు, తెలంగాణ బాక్సింగ్ అసోసియే షన్ అధ్యక్షులు రామాంజనేయులు ప్రత్యేకంగా అభినందించారు.

సెర్ప్ సిబ్బందికి శిక్షణ


శిక్షణకు హాజరైన వీవోఏలు, సెర్ప్ సిబ్బంది

జగిత్యాలరూరల్, ఫిబ్రవరి 15 : జగిత్యాల రూరల్ మండల సెర్ప్ కార్యాలయంలో సెర్ప్ సిబ్బందికి, వివోఏలకు శిక్షణ తరగతులు నిర్వహించారు. దీనిలో భాగంగా మహిళా సంఘాలకు అందిస్తున్న వివిధ రకాల రుణాలకు సంబంధించి, రుణాల ద్వారా జీవనోపాధుల గురించి అవగాహన కల్పించారు. ఈకార్యక్రమంలో డీపీఎం వనజ, శ్రీనిధి రీజనల్ మేనేజర్ ఆనందరావు, ఏపీఎంలు ఓదెల గంగాధర్, అశోక్, సీసీ రత్నాకర్, రవీందర్, శ్రీనివాస్, గంగారాం రాజు, మరియా, రాజేశ్వరి, శ్రీనివాస్, ఎస్. ఎన్ అసిస్టెంట్ మేనేజర్ రాణి, ఎస్. ఏ పద్మ, వీవోఏలు పాల్గొన్నారు.

క్షయ వ్యాధి నివారణపై అవగాహన కల్పించాలి

జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి శ్రీధర్


సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా వైద్య ఆరోగ్య అధికారి శ్రీధర్

మెట్‌పల్లి రూరల్, ఫిబ్రవరి, 15 : గ్రామాల్లో క్షయ వ్యాధి నివారణకు పాటించాల్సిన జాగ్రత్తలపై ప్రజలకు అవగహన కల్పించాలని జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి శ్రీధర్ సూచించారు. క్షయరహిత గ్రామ ప్రతిపాదనలో భాగంగా మండలంలోని చౌలమద్ది గ్రామంలో క్షయ పరీక్షలు జిల్లాలోనే ఎక్కువగా చేయగా అతి తక్కువగా నిర్ధారణ ఉన్నంటువంటిగా గుర్తించిన గ్రామాన్ని గురువారం పరిశీలించారు. గ్రామంలోని రికార్డులను, క్షయ వ్యాధి బారిన వారిని పరిశీలించి తీసుకోవాల్సిన సూచలను చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామాల్లో క్యాంపులు నిర్వహించి ప్రజలకు ఆరోగ్యంపై తీసుకోవాల్సిన జాగ్రత్తలపై సూచనలు చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఉపవైద్యాధికారి డాక్టర్ శ్రీనివాస్, టీబీ జిల్లా కోఆర్డినేటర్ హరీష్, మండల వైద్యాధికారి అంజిత్‌రెడ్డి, పంచాయతీ కార్యదర్శి రవి, కారోబార్ వాసాల రాములు, టీబీ సూపర్‌వైజర్లు రియాజ్, ఆంజనేయలు, ఏఎన్ఎమ్‌లు, ఆశా వర్కర్లు, సిబ్బంది పాల్గొన్నారు.

హుస్సేన్‌నగర్‌లో డీఎంహెచ్‌వో పర్యటన

మల్లాపూర్: కేంద్ర ప్రభుత్వం చేపట్టిన టీబీ ముక్త్ గ్రామ పంచాయతీ కార్యక్రమంలో భాగంగా జిల్లాలోని హుస్సేన్‌నగర్‌ను గురువారం సందర్శించిన జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ శ్రీధర్ పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన గ్రామంలోని ప్రజలకు క్షయ పరీక్షలు ఎక్కువగా చేసి ఉండి నిర్ధారణ తక్కువగా ఉన్న గ్రామాలను ప్రతిపాధించడంలో భాగంగా హుస్సేన్‌నగర్ ప్రతిపాధించామన్నారు. దీనికి సంబంధించిన రికార్డులను తనిఖీ చేశారు. దీని ఫలితాలు తెలియ రావలసిన ఉందన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఉప వైద్యాధికారి టీబీ ప్రోగ్రాం ఆఫీసర్ డాక్టర్ శ్రీనివాస్, ఎన్‌వీబీడీసీపీ ప్రోగ్రాం ఆఫీసర్ డాక్టర్ శ్రీనివాస్, టీబీ జిల్లా కోఆర్డినేటర్ హరీష్, మండల వైద్యాధికారిణి వాహిని, పంచాయతీ కార్యదర్శి సీహెచ్‌వో రామ్‌మోహన్, సిబ్బంది పాల్గొన్నారు.

స్నేహితుడి కుటుంబానికి ఆర్థిక సహాయం


ఆర్థిక సహాయం అందిస్తున్న స్నేహితులు

రాయికల్, ఫిబ్రవరి 15: రాయికల్ పట్టణానికి చెందిన గట్టుపెల్లి రాంబాబు ఇటీవల జరిగిన రోడ్డు ప్రమాదంలో గాయపడ్డాడు. అయితే రాంబాబు చికిత్స కోసం ఆర్థికంగా ఇబ్బంది పడుతుండటంతో 1996-97 పదవ తరగతి స్నేహితులు రూ. లక్షా 500 ఆర్థిక సహాయాన్ని గురువారం అందించారు. తోటి మిత్రుడు త్వరగా కోలుకొని ఆరోగ్యంగా ఉండాలని కోరారు.

ఈ సందర్భంగా రాంబాబు కుటుంబసభ్యులు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో మచ్చ శేఖర్, రాచర్ల ఆంజనేయులు, సిలివేరి సురేష్, భూమి మహేష్, సాంబారు శ్రీనివాస్, బెజ్జంకి హరికృష్ణ, కడార్ల శ్రీనివాస్, మండ రమేష్, వాసం శివకు మార్, పూరెల్లి శ్రీనివాస్, రాజేశం, బసవ రాజు, శ్రీపతి సత్తయ్య, మారంపెల్లి రమేష్, బండి రామ కృష్ణ, మ్యాకల నరేష్, మచ్చ కృష్ణ, పడాల రమేష్, పిన్నంశెట్టి రమేష్ తదితరులు పాల్గొన్నారు.

శివలింగానికి పూజలు

కొడిమ్యాల, ఫిబ్రవరి 15 : మండలంలోని పూడూర్ గ్రామ శివారులో బుధవారం సాయంత్రం పురాతన శివలింగం గ్రామస్తుడికి లభ్యమైంది. అయోధ్యకు వెళ్లిన గ్రా మస్థుల సహకారంతో శివలింగాన్ని పూడూర్ గ్రామ శివా రులో నిర్మించతలపెట్టిన రామాలయం స్థలంలో శివలిం గాన్ని రాత్రి తాత్కాలికంగా ప్రతిష్ఠించారు. గురువారం శివలింగానికి అభిషేకం, పూజలు చేశారు. ఈ కార్యక్రమంలో స్థల దాత గుడిపెల్లి మల్లారెడ్డి, పూడూర్ గ్రామస్తులు కడారి మల్లేశం, ఏగుర్ల రాజమల్లు, అయితం గణేష్, మిట్టపల్లి అనిల్, రాజేశం ఉన్నారు.

మృతుడి కుటుంబానికి ఆర్థిక సహాయం

భీమారం, ఫిబ్రవరి 15: భీమారం మండల కేంద్రానికి చెందిన దయ్య సురేష్ ఇటీవల అనారోగ్యంతో మృతి చెందాడు. విషయం తెలుసుకున్న మన్నెగూడెం దళిత సేవా సమితి సభ్యులు సురేష్ కుటుంబానికి రూ. 5 వేల ఆర్థిక సహాయం అందించారు. ఈ కార్యక్రమంలో సంఘం నాయకులు, సభ్యులు పాల్గొన్నారు.

సీసీ రహదారుల నిర్మాణానికి భూమి పూజ

మల్లాపూర్, ఫిబ్రవరి, 15 : మండలంలోని మొగిలిపేట గ్రామంలో రూ. 7లక్షల ఈజీఎస్ నిధుల వెచ్చించి రెండు చోట్ల నిర్మించనున్న సీసీ రహదారుల పనులకు గురువారం స్థానిక కాంగ్రెస్ నాయకులతో కలిసి ఎంపీటీసీ ఓస సత్తమ్మ-రాజరెడ్డి భూమి పూజ నిర్వహించారు. మండల కేంద్రంలో జరుగుతున్న సీసీ రహదారులను మాజీ జడ్పీటీసీ, కాంగ్రెస్ నాయకులు ఎలాల జలపతిరెడ్డి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన పలు సూచనలు చేశారు. వెంట కాంగ్రెస్ నాయకులు కోటగిరి ఆనంద్‌గౌడ్, మరిపల్లి మల్లయ్య, శ్రీనివాస్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

చికిత్స పొందుతూ వృద్ధుడి మృతి

వైద్యుడి నిర్లక్షమే కారణమని బంధువుల ఆందోళన

మెట్‌పల్లి, ఫిబ్రవరి, 15 : ఇబ్రహీంపట్నం మండలండబ్బా గ్రామానికి చెందిన అంబ్యారి చిన్నమల్లయ్య(70) అను వృద్ధుడు మెట్‌పల్లి పట్టణంలోని ఓ ఆస్పత్రిలో చికిత్స పొందుతూ రెండు రోజుల క్రితం మృతి చెందాడు. అయితే వృద్ధుడి మృతికి వైద్యుడి నిర్లక్షమే కారణమని మృతుడి బంధువులు గురువారం ఆందోళన చేపట్టారు. మృతిడి బంధువులు తెలిపిన వివరాల మేరకు.. చిన్న మల్లయ్యకు ఈనెల 12న చాతిలో నొప్పి రావడంతో గ్రామంలోని ఓ ఆర్ఎంపీకి చూపించారు. ఆయన సూచన మేరకు మెట్‌పల్లిలోని ఓ ప్రైవేటు ఆస్పత్రికి తరలించారు. ఈనెల 12 రాత్రి 10:30గంటల సమయంలో చిన్నమల్లయ్యను వైద్యుడు పరిశీలించి చికిత్స మొదలు పెట్టారు. కొన్ని టెస్టులు రాసిన వైద్యుడు కాసేపటికి ఇంటికి వెళ్లిపోయాడు. టెస్టుల రిపోర్టులు సదరు వైద్యుడు సిబ్బంది ద్వారా ఫోన్‌లో తెలుసుకుని ట్రీట్మెంట్ చేయాలని సిబ్బందికి సూచించరన్నారు. మళ్లీ అర్థరాత్రి రెండు గంటల సమయంలో చాతి నొప్పి మరింత ఎక్కువై శ్వాస తీసుకోవడానికి చిన్న మల్లయ్య ఇబ్బంది పడుతున్నాడని ఫోన్‌లో డాక్టర్‌కు సిబ్బంది తెలపడంతో మెరుగైన చికిత్స కోసం నిజామాబాద్ తీసుకెళ్లాలని సూచించాడు. దీంతో ప్రత్యేక వాహనంలో తీసుకెళ్తుండగా కమ్మరిపల్లి సమీపంలో చిన్నమల్లయ్య మృతి చెందాడు. చిన్న మల్లయ్య మృతికి వైద్యుడి నిర్లక్ష్యమే కారణమని భావించి కుటుంబ సభ్యులు, డాక్టర్‌ను నిలదీయడానికి వచ్చారు. సదరు వైద్యుడు పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేసినట్లు తెలిపారు.



దాడికి పాల్పడిన వ్యక్తుల రిమాండ్

చిగురుమామిడి,ఫిబ్రవరి15: మండలంలోని రేకొండ గ్రామానికి చెందిన ఎలకపల్లి రమేష్, ఎలకల పల్లి నవీన్ అనే వ్యక్తులపై కేసు నమోదు చేసి గురువారం రిమాండ్ చేసినట్లు ఎస్సై బండి రాజేశ్ తెలిపారు. ఇదే గ్రామానికి చేందిన కండె సాయికిరణ్ అనే వ్యక్తితో ఎలకపల్లి రమేష్, ఎలకపల్లి నవీన్‌లు డబ్బులు విషయంలో గొడవకు దిగారు. కత్తితో సాయికిరణ్‌పై దాడికి పాల్పడ్డారు. బాధితుడి తండ్రి కండె మల్లయ్య ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి ఇద్దరిని రిమాండ్‌కు పంపినట్లు ఎస్సై తెలిపారు.







ముగిసిన తొలిదశ ప్రజాహిత యాత్ర

సిరిసిల్ల, ఫిబ్రవరి 15 (ఆంధ్రజ్యోతి): కేంద్ర ప్రభుత్వం గ్రామాలకు అందిస్తున్న నిధుల లెక్కలు వినిపిస్తూ ప్రజాసమస్యలు తెలుసుకుంటూ ఎంతో ఉత్సాహంగా సిరిసిల్ల, వేములవాడ నియోజకవర్గాల్లో బీజేపీ జాతీయ ప్రధాన కార్యదర్శి కరీంనగర్ ఎంపీ బండి సంజయ్ చేపట్టిన ప్రజాహిత యాత్ర గురువారం ముగిసింది. కొండగట్టు అంజన్న దేవస్థానంలో ప్రత్యేక పూజలు చేసి మేడిపల్లి వద్ద ప్రారంభించిన ప్రజాహిత యాత్ర రాజన్న సిరిసిల్ల జిల్లాలోని అగ్రహారం అంజనేయస్వామి దేవస్థానం వద్ద ప్రత్యేక పూజలతో ముగించారు. చివరి రోజు తంగళ్లపల్లి మండ ల కేంద్రం నుంచి సిరిసిల్ల జిల్లా కేంద్రం మీదుగా అగ్రహారం వరకు కొనసాగింది. సిరిసిల్లలో కొండా లక్ష్మణ్‌బాపూజీ, చాకలి ఐలమ్మ, గాంధీ, అంబేద్కర్, చేనేత విగ్రహాలకు పూలమాలలు వేశారు. ముగింపు సందర్భంగా భారీ కేక్‌ను కట్ చేశారు. ఆరు రోజుల పాటు రెండు నియోజకవర్గాల్లో 13 మండలాలు, రెండు మున్సిపాలిటీలు, 81 గ్రామాల్లో యాత్ర సాగింది.

● బీఆర్‌ఎస్‌కు ఒక్క ఎంపీ సీటు కూడా రాదు

ముగింపు సందర్భంగా బండి సంజయ్ విలేకరుల సమావేశంలో మాట్లా డారు. తెలంగాణలో బీఆర్‌ఎస్‌కు ఒక్క ఎంపీ సీటు కూడా రాదని, బీఆర్‌ఎస్‌తో పొత్తు పెట్టుకోవాల్సిన ఖర్మ మాకేందని ప్రశ్నించారు. దేశ వ్యాప్తంగా 400 సీట్లు బీజేపీకి రాబోతున్నాయని వివరించారు. మోదీ హవాను తట్టుకోలేక బీఆర్‌ఎస్, కాంగ్రెస్ కలిసి బీజేపీని దెబ్బ తీసేందుకు విషప్రచారం చేస్తున్నాయన్నారు. కార్యక్రమంలో బీజేపీ జిల్లా అధ్యక్షుడు ప్రతాప రామకృష్ణ, బీజేపీ రాష్ట్ర అధికార ప్రతినిధి రాణిరుద్రమ, మున్సిపల్ మాజీ చైర్మన్ అడెపు రవీందర్, అల్లాడి రమేష్, ఎర్రం మహేష్, బర్కం వెంకటలక్ష్మీ పాల్గొన్నారు.


సిరిసిల్ల జిల్లా కేంద్రంలో బండి సంజయ్ ప్రజాహిత యాత్ర

గోదావరిలో పడి వ్యక్తి మృతి

వెల్గటూర్, ఫిబ్రవరి 15: కోటిలింగాల గోదావరిలో పడి ఓ వ్యక్తి మృతి చెందాడు ఎస్సై ఉమాసాగర్ తెలిపిన వివరాల ప్రకారం.. దండేపల్లి మండలం మ్యాదరిపేటకు చెందిన బత్తిని కమల్‌గౌడ్ (27) అనే యువకుడు తనకు డాటా ఎంట్రీ ఆపరే టర్ ఉద్యోగం వచ్చిందని చెప్పి ఇంటి నుంచి రూ.70 వేలు, బంధువుల దగ్గర రూ.44,500 తీసు కొని ఈ నెల 13న మధ్యాహ్నం టీఎస్ 09ఇసి3725 నంబ రు గల స్కూటీపై ఇంటి నుంచి వెళ్లిపోయాడు. అదే రోజు రాత్రి తనకు వరుసకు అల్లుడైన ఆకుల పవన్‌కు తన మొత్తం డబ్బులు హ్యాక్ అయ్యాయని ఫోన్ చేసి చెప్పాడు. ఈ క్రమంలో బుధవారం కోటిలింగాల గోదావరిలో శవమై తేలాడు. తన దగ్గర ఉన్న డబ్బులు మొత్తం అయిపోవడంతో చేతిలో డబ్బులు లేకుండా ఇంటికి ఎలా వెళ్లాలో తెలియక గోదావరిలో దూకి ఆత్మహత్య కు పాల్పడినట్లు మృతుని తండ్రి బత్తిని మల్లేష్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

భవనం పైనుంచి పడి ఒకరికి గాయాలు

ఎల్లారెడ్డిపేట, ఫిబ్రవరి15: ఎల్లారెడ్డిపేట గ్రామ శివారులోని డబల్‌బెడ్ రూం ఇళ్ల సముదాయంలో శ్రీగాద భాస్కర్ అనే వ్యక్తి గురువారం భవనం మొదటి అంతస్తు పైనుంచి ప్రమాదవశాత్తు కిందపడి తీవ్రగాయాల పాలయ్యాడు. అతన్ని కుటుంబీకులు, కాలనీవాసులు మండల కేంద్రంలోనీ ఓ ప్రైవేటు ఆసుపత్రికి తరలించారు. గ్రామంలోని డబుల్ బెడ్‌రూం ఇళ్ల సముదాయంలో భాస్కర్ తన కుటుంబీకులతో కలిసి మొదటి అంతస్తులో నివాసముంటున్నాడు. భవనం బాల్కనీ నుంచి కిందకు చూస్తున్న క్రమంలో ప్రమాదవశాత్తు కిందపడ్డాడు. భాస్కర్ పరిస్థితి విషమంగా ఉందని కుటుంబ సభ్యులు తెలిపారు.

బావిలో దూకి వృద్ధురాలి ఆత్మహత్య


గంభీరావుపేట, పిబ్రవరి 15 : గంభీరావుపేట మండలం ముస్తాఫనగర్ గ్రామ సమీప వ్యవసాయ బావిలో దూకి లింగన్నపేటకు చెందిన బర్కుటం లక్ష్మి (65) అనే వృద్ధురాలు గురువారం ఆత్మహత్య చేసుకుంది. పోలీస్‌లు, బంధువులు తెలిపిన వివరాల ప్రకారం.. లింగన్నపేటకు చెందిన లక్ష్మి భర్త ఎనమిదేళ్ల క్రితం చనిపోయాడు. ఉన్న ఒక కొడుకు మూగవాడు కావడంతో లక్ష్మి తరుచూ ఆవేదన చెందేది. కొడుకు గ్రామ సమీపంలో ఉన్న రైస్‌మిల్‌లో పనిచేస్తూ అక్కడే ఉండేవాడు. ఇంట్లో లక్ష్మి ఒంటరి జీవితం గడుపుతూ మనోవేదనతో మానసికంగా బాధపడుతూ ఉండేది. ఈ క్రమంలో లక్ష్మి మతిస్థిమితం కోల్పోయినట్లు ప్రవర్తించింది. ముస్తాఫనగర్ గ్రామ సమీపాన గల వ్యవసాయ బావిలో పడి మృతి చెందింది. మృతురాలు మరిది భూమయ్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ రాంమోహన్ తెలిపారు.

రైతు మృతిపై వీడని మిస్టరీ

● సీపీకి ఫిర్యాదు చేసిన మృతుడి కుటుంబ సభ్యులు


కొమురయ్య (ఫైల్)

గన్నేరువరం, ఫిబ్రవరి 15, మండలంలోని గుండ్లపల్లి గ్రామానికి చెందిన రైతు పంబాల కొమురయ్య(55) తన వ్యవసాయ క్షేత్రంలో బుధవారం అనుమానాస్పదంగా మృతి చెందాడు. ఈ విషయమై గురువారం తిమ్మాపూర్ రూరల్ సీఐ స్వామి, గన్నేరువరం ఎస్ఐ చందా నరసింహారావుతో కలిసి సంఘటనా స్థలాన్ని పరిశీలించి విచారణ చేపట్టారు. బుధవారం రాత్రి మృతదేహాన్ని కరీంనగర్ ప్రభుత్వ ఆసుపత్రికి పోస్టుమార్టంకు తరలించగా గురువారం సాయంత్రం వరకు పోస్టుమార్టం చేపట్టలేదు. గుండ్లపల్లి గ్రామానికి చెందిన ఓ వ్యక్తి తన వ్యవసాయబావి నుంచి మోటారును బయటకు తీసేందుకు తన తండ్రిని తీసుకెళ్లాడని అక్కడే విద్యుదాఘాతంతో తన తండ్రి మృతి చెందాడని ఆరోపిస్తూ మృతుడి కుమారుడు రాజశేఖర్ గురువారం సీపీకి ఫిర్యాదు చేశాడు. అనంతరం మృతదేహానికి పోస్టుమార్టం నిర్వహించి మృతదేహాన్ని కుటుంబ సభ్యులకు అప్పగించారు. మృతుడి కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు పోస్టుమార్టం నివేదిక అందిన తర్వాత మృతికి గల కారణాలను వెల్లడిస్తామని ఎస్ఐ చందా నరసింహారావు తెలిపారు. చట్టప్రకారం చర్యలు చేపట్టనున్నట్లు తెలిపారు.





అనుమానాస్పదంగా సంచరిస్తున్న
యువకుడిని చితకబాదిన గ్రామస్థులు

గొల్లపల్లి, ఫిబ్రవరి 15: మండలంలోని వెన్గుమట్ల గ్రామంలో అనుమానాస్పదంగా సంచరిస్తున్న అపరిచిత యువకుడిని పిల్లలను ఎత్తుకెళ్లే ముఠా సభ్యుడు అనుకుని గ్రామస్థులు చితకబాదారు. అనంతరం గొల్లపల్లి పోలీసులకు అప్పగించారు. యువకుడు కొంతకాలంగా మతిస్థిమితం సరిగా లేక తిరుగుతున్నాడని పోలీసుల విచారణలో తేలడంతో తల్లిదండ్రులకు సమాచారం అందించారు. ఎస్సై చిర్ర సతీష్‌కుమార్ తెలిపిన వివరాల మేరకు.. సిద్ధిపేట జిల్లా జూలపల్లి గ్రామానికి చెందిన శ్రీకాంత్(25) కొంతకాలంగా మతి స్థిమితం సరిగా లేక హైదరాబాద్‌లోని ఎర్రగడ్డ పిచ్చి ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నాడు. ఇటీవల స్వగ్రామానికి తిరిగి వచ్చాడు. ఆరు నెలల క్రితం ఇంటిలో నుంచి అదృశ్యం కావడంతో యువకుడి తల్లిదండ్రులు అతని ఆచూకీ కోసం గాలిస్తున్నారు. ఈ క్రమంలో వెన్గుమట్ల గ్రామంలో యువకుడు అనుమానాస్పదంగా సంచరించడాన్ని గ్రామస్థులు గుర్తించారు. వారం రోజులుగా పిల్లలను ఎత్తుకెళ్లే ముఠా గ్రామాల్లో సంచరిస్తున్నట్లు సోషల్ మీడియాలో విస్తృతంగా ప్రచారం జరుగుతుంది. దీంతో గ్రామస్థులు పిల్లలను ఎత్తుకెళ్లే ముఠాకు సంబంధించిన దొంగ అనుకుని యువకుడిని పట్టుకుని దేహశుద్ధి చేశారు. అనంతరం పోలీసులకు అప్పగించారు. బాధిత యువకుడిని విచారించగా అతని మానసిక స్థితి సరిగా లేదని గుర్తించారు. అతని తల్లిదండ్రులకు సమాచారం అందించినట్లు ఎస్సై పేర్కొన్నారు. ఎస్సై మాట్లాడుతూ వదంతులను సోషల్ మీడియాలో షేర్ చేయవద్దని సూచించారు.

చికిత్స పొందుతూ వివాహిత మృతి

వీణవంక,ఫిబ్రవరి15:మండలంలోని పోతిరెడ్డిపల్లి గ్రామానికి చెందిన సయ్యద్ నజీర (20) పురుగుల మందు తాగి చికిత్స పొందుతూ మృతి చెందింది. పోలీసుల వివరాల ప్రకారం... నజీర మానసిక స్థితి సరిగాలేక పోవడం, అనారోగ్యంతో జీవితంపై విరక్తి చెంది పురుగుల మందు తాగింది. గమనించిన కుటుంబ సభ్యులు జమ్మికుంట ఆసుపత్రికి తరలించగా చికిత్స పొందుతూ మృతి చెందింది. మృతురాలి తల్లి షేక్ హైదర్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై వంశీకృష్ణ తెలిపారు.

ఇసుక తరలిస్తున్న ట్రాక్టర్ పట్టివేత

వీణవంక,ఫిబ్రవరి 15: మండలంలోని మాల్లారెడ్డిపల్లి గ్రామ మానేరు వాగు నుంచి ప్రభుత్వం నుంచి ఎలాంటి అనుమతులు లేకుండా అక్రమంగా ఇసుక రవాణ చేస్తున్నా ట్రాక్టర్ ను పట్టుకొని పోలీస్ స్టేషన్ తరలించినట్టు పోలీస్‌లు తెలిపారు.చల్లూరు గ్రామ చివరులో వాహనాలు తకిఖీలు చేస్తుండగా మాల్లారెడ్డిపల్లి గ్రామనికి చెందిన మేకల శ్రీనివాస్ ఎలాంటి అనుమతులు లేకుండా అక్రమంగా ఇసుక రవాణ చేస్తుండగా అతని పై కేసు నమోదు చేసినట్టు ఎస్సై వంశీకృష్ణ తెలిపారు.మండలంలో అనుమతులు లేకుండ అక్రమంగా ఇసుక రవాణ చేస్తే కటిన చర్యలు తీసుకుంటామని ఎస్సై హెచ్చరించారు.

ఏటీఎం దోపిడీకి పాల్పడిన నిందితుడి అరెస్టు

● పరారీలో మరో ముగ్గురు

కోల్‌సిటీ, ఫిబ్రవరి 15: ఈ నెల 10న గోదావరిఖని గౌతమినగర్ హనుమాన్ గుడి వద్ద ఉన్న ఏటీఎంలో డబ్బులు దోచుకెళ్లిన ఘటనలో ప్రధాన నిందితుడు హకీముద్దీన్‌ను రామగుండం పోలీసులు గురువారం అరెస్టు చేశారు. ఈ మేరకు రామగుండం సీఐ టీ ప్రవీణ్ కుమార్ అరెస్టు వివరాలను వెల్లడించారు. హర్యాన రాష్ట్రానికి చెందిన హకీముద్దీన్, సోకెంఖాన్, అమీర్‌ఖాన్, వసీంఖాన్‌లు ఈ నెల 10న అర్ధరాత్రి గౌతమినగర్‌లోని ఏటీఎంను గ్యాస్ కట్టర్‌తో కట్ చేసి అందులోని రూ.27,59,000లను దోచుకెళ్లారు. ఈ ఘటనపై రెండు ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేసి సాంకేతిక పరిజ్ఞానం ఉపయోగించుకుని హర్యాన రాష్ట్రంలో నిందితులు పారిపోతుండగా హకీముద్దీన్‌ను అరెస్టు చేసి కోర్టులో హాజరు పర్చినట్లు సీఐ తెలిపారు. మిగతా నిందితులు సోకెంఖాన్, అమీర్‌ఖాన్, వసీంఖాన్ పారిపోయారని, వీరిని పట్టుకోవడానికి బృందాలు గాలింపు చర్యలు చేస్తున్నట్లు తెలిపారు. నిందితున్ని పట్టుకోవడానికి కృషి చేసిన సిబ్బందిని పెద్దపల్లి డీసీపీ చేతన్ అభినందించారు.

డ్రంకెన్‌డ్రైవ్‌లో ముగ్గురికి జైలు శిక్ష

కరీంనగర్ క్రైం, ఫిబ్రవరి 15 : మోతాదుకు మించి అధికంగా మద్యం సేవించి వాహనాలు నడుపుతూ పట్టుబడిన ముగ్గురు వ్యక్తులకు కరీంనగర్ మున్సిఫ్ కోర్టు మెజిస్ట్రేట్ జైలుశిక్ష, జరిమానా విధించారని కరీంనగర్ ట్రాఫిక్ ఏసీపీ ఎండీ సర్వర్ తెలిపారు. డ్రంకెన్‌డ్రైవ్‌లో పట్టుబడిన 22 మంది వాహనదారులను గురువారం కోర్టులో హాజరుపరచగా ఒక వ్యక్తికి 10 రోజులు, మరొకరికి 7 రోజులు, ఇంకొకరికి 3 రోజుల వంతున జైలు శిక్షతో పాటు ముగ్గురికి కలిపి 6 వేల జరిమానా విధించినట్లు తెలిపారు. మిగతా 19 మంది వాహనదారులకు 33,500 రూపాయల జరిమానా విధించినట్లు తెలిపారు.

నివేదన



భద్రాచలానికి వచ్చే మార్గంలో దుమ్ముగూడెం (దూమగూడెం) అనే ఊరు ఉంది. దాని అవతలి ఒడ్డున ఉన్న చిన్న గుట్ట సమీపంలోనే జటాయువుకు, రావణుడికి యుద్ధం జరిగినట్టు రామాయణంలో ఉంది. ఆ గుట్ట దగ్గరే జటాయువుకు శ్రీరాముడు అంత్య సంస్కారాలు చేశాడు.

పంచవటి మనదే!

అయోధ్యలో శ్రీరామ విగ్రహ ప్రాణప్రతిష్ఠ అనంతరం ప్రధాని నరేంద్ర మోదీ శ్రీరామ వనవాస మార్గం గురించి వివరించారు. ఆ వివరాలకు సంస్కృత రామాయణంలో వాల్మీకి రచించిన దానికీ తేడా ఉంది. అయోధ్య నుంచి ఉత్తరప్రదేశ్‌లోని ప్రయాగ్‌రాజ్‌లో ఉన్న భరద్వాజ ఆశ్రమానికి, మధ్యప్రదేశ్‌లోని చిత్రకూటానికి, మహారాష్ట్రలోని నాసిక్ దగ్గర ఉన్న పంచవటికి, ఆంధ్రప్రదేశ్‌లోని అనంతపురం జిల్లా లేపాక్షికి, కర్ణాటకలోని కిష్కింధకు, తమిళనాడులోని రామేశ్వరానికి, అక్కడి నుంచి శ్రీలంకకు శ్రీరాముడు పయనించాడనడం సరికాదేమో! ప్రధాని తన ప్రసంగంలో లేపాక్షి, నాసిక్‌లోని పంచవటుల గురించి ప్రస్తావించారే కానీ... దక్షిణ అయోధ్యగా ప్రసిద్ధి చెందిన భద్రాచల రామాలయం సమీపంలోని పంచవటి గురించి కానీ, అసలు ఆ ఆలయం గురించి కానీ కనీసం ప్రస్తావించలేదు. ఇది తెలుగువారిని ఒకింత నిరాశకు గురిచేసిందనాలి. అయోధ్య నుంచి లంక దాకా శ్రీరాముడి ప్రస్థానం, తిరుగు ప్రయాణంలో అయోధ్యకు వస్తూ సీతకు రాముడు చూపించిన ప్రదేశాలు వావిలికొలను సుబ్బారావు (వాసుదాసు)గారి 'ఆంధ్ర వాల్మీకి రామాయణం' (మందరం) వ్యాఖ్యానంలో వివరంగా ఉన్నాయి.

అరణ్యాలకు బయలుదేరిన సీతారామలక్ష్మణులు తామసా నదీ తీరం, ఉత్తరకోసల దేశం, వేదశ్రుతి నది, గోమతీ నది, దక్షిణ కోసల దేశ సరిహద్దులు దాటి... గంగానదీ తీరంలోని శృంగబేరి పురాన్ని చేరారు. గుహుడి సాయంతో గంగను దాటి, గంగా యమున సంగమ స్థలిలోని భరద్వాజ ముని ఆశ్రమానికి వెళ్ళారు. యమునను దాటి, నీలవన మార్గంలో పయనించి, మందాకినీ సరయూ నది దగ్గరలో ఉన్న చిత్రకూటం చేరారు. అక్కడ వాల్మీకిని చూశారు. చిత్రకూటంలో లక్ష్మణుడు పర్ణశాల నిర్మించాడు. భరతుడు చిత్రకూటానికి వచ్చి, వెళ్ళాక... వారు అత్రి మహాముని ఆశ్రమానికీ, అనంతరం దండకారణ్యంలో ప్రవేశించి, విరాధుణ్ణి సంహరించి, శరభంగ మహర్షి ఆశ్రమానికీ, అటు నుంచి సుతీక్ష్ణాశ్రమానికీ, మాండకర్ణి ఆశ్రమానికీ ప్రయాణించారు. అగస్త్యుణ్ణి ఆయన ఆశ్రమంలో దర్శించుకున్నారు. పంచవటి అనే నివాస యోగ్యమైన స్థలం రెండు ఆమడల దూరంలో ఉందని అగస్త్యుడు సూచించాడు. అగస్త్యుడు చెప్పిన మార్గంలో వెళ్తూ, దారిలో ఒక మర్రి చెట్టు మీద ఉన్న జటాయువును రాముడు కలిశాడు. తరువాత సీతా లక్ష్మణ సమేతుడై పంచవటిని చేరుకున్నాడు. అక్కడ పర్ణశాల నిర్మించమని లక్ష్మణుడికి చెప్పాడు. లక్ష్మణుడు కుటీరాన్ని సిద్ధం చేశాడు. అవే ఇప్పటికీ భద్రాచలానికి 30 కిలోమీటర్ల దూరంలో ఎందరో భక్తులను ఆకర్షిస్తున్న పంచవటి, పర్ణశాలలు. భద్రాచలం సమీపంలో ఉన్నది పర్ణశాల కాదనీ, అది నాసిక్‌కు దగ్గరగా ఉందనీ చెప్పడం పూర్తిగా సత్యదూరం.

పంచవటి గోదావరీ తీరంలో ఉందనేది నిర్వివాదాంశం. అక్కడ గోదావరి ఉత్తరం నుంచి దక్షిణానికి పారుతూ ఉండాలి. ఎందుకంటే సీతాపహరణం తరువాత... సీతను రావణుడు తీసుకువెళ్ళినది దక్షిణ దిక్కుగానని మృగాలు, పక్షులు సూచించిన మేరకు... రామలక్ష్మణులు గోదావరీ తీరాన మొదట నైరుతి దిశగా వెళ్ళారు. తరువాత దక్షిణంగా వెళ్ళారు. గోదావరీ తీరంలో వారు జటాయువును చూశారంటే... గోదావరి నది జటాయువు పడిన స్థలం వరకూ... దక్షిణాభిముఖంగా పారుతూ ఉండాలి. జటాయువుకు గోదావరీ జలాలతో నివాపాలు (తిలోదకాలు) విడిచారు. అక్కడి నుంచి రామ లక్ష్మణులు తూర్పుగా వెళ్ళడానికి ఏరు అడ్డం వస్తుంది కాబట్టి... నైరుతి దిశగానే మూడు కోసుల దూరం పయనించారు. కొంత తూర్పుగా వెళ్తే కాని జటాయువు చెప్పిన దక్షిణ మార్గం కనిపించదు కాబట్టి... అక్కడి నుంచి మూడు కోసులు తూర్పుగా వెళ్ళారనుకోవాలి. అంటే అప్పుడు వారు.. ఇప్పటి భద్రాచలం దగ్గర, గోదావరి నదికి దక్షిణాన ఉన్నారు. అలా వచ్చారు కాబట్టి గోదావరి దాటవలసిన పని లేదు. ఆ కారణం వల్ల పంచవటి గోదావరి నదికి పడమటి తీరాన ఉందనే విషయం స్పష్టంగా అంగీకరించాలి. తూర్పున ఉన్నట్టయితే గోదావరి దాటే ఉండాలి. ఇప్పటి పర్ణశాలే యదార్థమయిన పంచవటి అయినా కావాలి. లేని పక్షంలో ఇప్పుడు అందరూ భావిస్తున్న పర్ణశాలకు ఎదురు ఒడ్డున, చక్కటి పంచవటి ఉండేదని మాత్రం నిర్ధారణగా చెప్పవచ్చు. నాసిక్ దగ్గర పంచవటి ఉన్నదనీ, అక్కడి నుంచి దక్షిణంగా రామలక్ష్మణులు వెళ్ళారనీ చేసే వాదన రామాయణానికి విరుద్ధం. పంచవటి గోదావరీ నది పశ్చిమ తీరాన ఉందనడానికి స్థలం ఆధారంగా ఉంది. పర్ణశాలకు ఎదురుగా ఉన్న గుట్ట దగ్గర రావణాసురుడు తన రథాన్ని నిలిపాడని అంటారు. కారణం... సీతాదేవిని ఎత్తుకురాగానే రథం సిద్ధంగా ఉండాలి కాబట్టి. నదికి ఒక ఒడ్డున రథం, మరో ఒడ్డున సీత ఉంటే... సీతాపహరణం సాధ్యమయ్యేది కాదనుకోవాలి. కాబట్టి పడమటి దిక్కున ఉన్న పంచవటి దగ్గర సీతాపహరణం జరిగి ఉండాలి. అలాగే అక్కడికి సమీపంలోనే 'సీత గుట్టలు' అనే పెద్ద పర్వతం ఉంది. ఖరుడు యుద్ధానికి వచ్చినప్పుడు... రామలక్ష్మణులు అక్కడ ఉన్న కారణంగా ఆ గుట్టలకు ఆ పేరు వచ్చిందంటారు.

హంపీ... పంప ఒకటి కాదు...

ఇప్పటి హంపీయే అప్పటి పంప అనీ, అక్కడే పర్ణశాల ఉన్నదనీ అనడం కూడా సరికాదు. రామలక్ష్మణులు లంకకు వెళ్ళేటప్పుడు ఏ మార్గం నుంచి వెళ్ళినా, తిరిగి వచ్చేటప్పుడు... విమానంలో తక్కువ దూరంలో ప్రయాణించే విధంగా... లంక నుంచి సముద్రం దాటాక... రామేశ్వరం నుంచి అయోధ్యకు వెళ్ళారనేది అందరూ అంగీకరించినదే. అలాంటప్పుడు ఎడమ వైపు కిష్కింధ, కుడివైపున పంచవటి ఉండి ఉండాలి. ఆ మార్గానికీ నాసిక్‌కూ సంబంధమే లేదు. కాబట్టి పంచవటి... నాసిక్ కానే కాదు. కావడానికి వీల్లేదు. సీతారామలక్ష్మణులు చిత్రకూటం నుంచి దక్షిణంగా ఋక్షవంతానికి వచ్చి, పశ్చిమాభిముఖంగా నాసిక్‌ను చేరినట్టయితే... మార్గమధ్యంలో వింధ్య పర్వతాన్ని, నర్మద, తపతీ నదులను దాటి... విదర్భ మీదుగా ప్రయాణించవలసి ఉంటుంది. వాటిని వారు దాటినట్టయితే... వాల్మీకి తప్పకుండా రాసేవాడు. రామలక్ష్మణులు దక్షిణానికి వచ్చి, ఆ తరువాత ఆగ్నేయంగా కిష్కింధకు వచ్చారనడం రామాయణానికి ప్రత్యక్ష విరుద్ధమని చెప్పాలి. నిజానికి...వారు నైరుతి మూలగా, నైరుతిగా వెళ్ళి, కబంధుణ్ణి చంపి, పడమరగా వెళ్ళి, పంప (తుంగభద్ర) చేరి, పడమరలో ఉన్న శబరి గుహకు వెళ్ళారు. జటాయువు గుట్ట దగ్గర నుంచి నైరుతికి వస్తేనే కిష్కింధకు రాగలరు. అలాకాకుండా ఆగ్నేయ మూలగా వెళ్ళి ఉంటే... సముద్రతీరానికి చేరేవారే తప్ప కిష్కింధకు కాదు. ఆగ్నేయమూలగా వారు ప్రయాణించారని రామాయణంలో ఒక్క మాటయినా లేదు.

> పంచవటికి దగ్గరలోనే పద్మ సరస్సు ఉందని 'వాల్మీకి రామాయణం' చెబుతోంది. అలాంటి పెద్ద చెరువొకటి ఉండేదని అక్కడ ఉండే కోయలు చెబుతూ ఉంటారు. ఆ చెరువుకూ, గోదావరికీ మధ్య పంచవటి ఉంది.

సీతారామలక్ష్మణుల వనవాసం చివర్లో... సీతాపహరణం కోసం రావణుడు, మారీచుడు కలిసి దండకారణ్యంలోని రామచంద్రుడి ఆశ్రమానికి చేరుకున్నారని 'వాల్మీకి రామాయణం'లో ఉంది. పర్ణశాలకు ఉత్తరాన పర్వతాలు, తూర్పున గోదావరి, దక్షిణ, పడమర దిశల్లో అడవి ఉన్నాయి. రాముణ్ణి మారీచుడు పడమరగానే తీసుకువెళ్ళాడు. రావణుడు వెళ్ళాల్సింది దక్షిణ మార్గాన కాబట్టి... ఆ దోవలో రాముడు ఉండకూడదని మారీచుడు అలా చేశాడు. సీతను రావణుడు అపహరించుకుపోతున్నప్పుడు... పర్ణశాలకు మైలు దూరంలోని వృక్షం దగ్గర జటాయువు ఎదురయింది. రావణుడు, జటాయువు మధ్య యుద్ధం అయిదారు మైళ్ళ దూరంలోని దుమ్ముగూడెం దగ్గరున్న జటాయువు గుట్ట వరకూ సాగింది. రావణుడు సీతను ఎత్తుకొని, పర్ణశాల నుంచి బయలుదేరి, కిష్కింధ మీదుగా, పర్వతాలు, తటాకాలు దాటి, సముద్రాన్ని సమీపించి, లంకకు పోయాడనుకోవాలి. ఇవన్నీ పర్ణశాల ఎక్కడుందో తెలిపే అంశాలు.

సీతాన్వేషణలో భాగంగా రామలక్ష్మణులు క్రౌంచారణ్యం, మతంగవనం, పంపానది ఒడ్డున ఉన్న ఋశ్యమూక పర్వతం మీదుగా వెళ్ళారు. అప్పటివరకూ వారు దక్షిణ దిక్కుగానే ప్రయాణం చేశారు. శబరి ఆశ్రమానికి తూర్పు దిక్కులోనే పోవాలి కాబట్టి... వారు పడమరగా వెళ్ళి, తూర్పుకు తిరగాల్సి ఉంటుంది. నాసిక్ దగ్గర పంచవటి ఉన్నదనే వారి వాదనకు ఇది పూర్తిగా వ్యతిరేకం. ఆ తరువాత వారు కిష్కింధ వెళ్ళారు. రావణుడితో యుద్ధానికి వెళ్ళేదాకా ప్రస్రవణ పర్వతం మీద ఉన్నారు. కిష్కింధకు ఆగ్నేయంగా ఉన్న లంకకు పోతూ మహేంద్ర పర్వతం ఎక్కారు. రావణ వధ అనంతరం సీతా సమేతంగా అయోధ్యకు పుష్పక విమానం మీద తిరుగు ప్రయాణం కావడం... వనవాసంలో భాగం. ఆ తిరుగు ప్రయాణంలో ఈ ప్రదేశాలన్నీ సీతకు రాముడు చూపించడం కొసమెరుపు.

(వాసుదాసు గారి 'ఆంధ్రవాల్మీకి రామాయణం' (మందరం) ఆధారంగా)

• వనం జ్వాలా నరసింహారావు

పర్వదినం



జగత్ చైతన్యకారకుడు

*బ్రహ్మస్వరూపముదయే మధ్యాహ్నేతు మహేశ్వరః
సాయం సంధ్యే సదా విష్ణుం త్రయీమూర్తిర్దివాకరః*

సూర్యుడు త్రిమూర్త్యాత్మకుడు. ముల్లోకాలలోని ప్రాణులతో... త్రికాలాలలో పూజలు అందుకుంటున్న ప్రత్యక్ష దైవం. ఆదిత్యుడు, దివాకరుడు, సూర్యనారాయణుడు... ఇలా ఆయనకు ఎన్నో నామాలు. ఈ చరాచర జగత్తుకు వెలుగును, తేజస్సును ఆయన ప్రసాదిస్తాడు. అదితి-కశ్యపులకు ఆయన జన్మించిన రోజైన మాఘ శుద్ధ సప్తమి... 'రథసప్తమి'గా ప్రసిద్ధిచెందింది. ఉత్తర దిశగా సూర్యుడి గమనం ఈ రోజే ఆరంభమవుతుందని 'మత్స్యపురాణం' చెబుతోంది. ముప్పై మూడు కోట్ల మంది దేవతలు ఉన్నారని మనం చెప్పుకొంటున్నా... మనకు నిత్యం దర్శనమిచ్చే దైవం ఆదిత్యుడే. ఈ సృష్టిలో పన్నెండుమంది ఆదిత్యులు ఉన్నారనీ, సమస్త జీవజాలానికీ, సృష్టివిధానానికీ వారే ఆధారభూతులనీ 'భవిష్యపురాణం' చెబుతోంది. నవగ్రహాలలో మనకు కనిపించే ఏడు గ్రహాలను వారంలోని ఏడు రోజులకు పేర్లుగా పూర్వ ఋషులు నిర్ణయించారు. ఆదిత్యుని పేరిట ఆదివారాన్ని స్థిరపరిచారు.

సూర్యుడు మానవుల మనుగడకు ఆధారభూతుడు. కాంతికి, శక్తికి, చైతన్యానికి కారకుడు. సమస్త జ్ఞాన, విజ్ఞానాలకు అధిపతి. ఆయనను కర్మసాక్షిగా, స్థితికారకుడిగా పురాణాలు, ఇతిహాసాలు అభివర్ణించాయి. సూర్యుడి శక్తివల్లనే భూమండలంతో సహా ఇతర గ్రహాలు సంచరిస్తున్నాయి. ఆయనాలు, ఋతువులు ఏర్పడడానికి సూర్యగమన శక్తే కారణం. యజ్ఞాగ్నిగా సౌర శక్తిని మన ఋషులు దర్శించారు. సూర్య, భూగ్రహాల మధ్య ఉన్న సంబంధాన్ని విజ్ఞానపరంగా విశ్లేషించి... జ్యోతిష శాస్త్రాన్ని నిర్మించారు. మాసాలు, పక్షాలు, తిథులను నిర్దేశించి పంచాంగ శాస్త్రాన్ని ఆవిష్కరించారు. గ్రహాలు, రాశుల సంచారాలు, కలయికలను పరిశీలించి... వాతావరణ విజ్ఞానం అందించారు. ఇంతటి మహోన్నతమైన విజ్ఞానానికి ఆధారం సూర్యభగవానుడే.

ఆధ్యాత్మికంగా పరిశీలిస్తే.. 'అఘము' అంటే పాపం... 'మా' అంటే తొలగించడం. మాఘ మాసంలో వచ్చే సూర్యజయంతి రోజున ఆయనను అర్చిస్తే పాపాలన్నీ తొలగిపోతాయనేది శాస్త్రవచనం. రథసప్తమి నాడు ఉత్తరాభిముఖంగా... రథంలో సూర్యుడు పయనిస్తాడు. ఆ రథానికి ఒకటే చక్రం. దానికి పన్నెండు ఆకులు. అవి పన్నెండు మాసాలకు సంకేతం. ఆ రథానికి ఒకటే అశ్వం. 'ఏకో అశ్వోవహతి సప్తనామా' అని చెప్పింది ఋగ్వేదం. ఆ రథంలో అధిష్టితుడైన సూర్యుని కాంతి ఏడు వర్ణాలుగా... కిరణాలుగా ప్రసరితమవుతుంది. వాటినే ఏడు అశ్వాలుగా పరిగణిస్తారు. ఈ విశ్వమంతా ఆ కిరణాల విలాసమే. అవి ఆరోగ్యప్రదాలని, సూర్యోదయవేళ ఆ లేత కిరణాలు శరీరంపై సోకితే... శారీరక, మానసిక రుగ్మతలు తొలగిపోతాయని, సూర్యనమస్కారాలతో దారుఢ్యం కలుగుతుందనీ ఆయుర్వేద, యోగ శాస్త్రాలు చెబుతున్నాయి. ఆదిత్యుని ద్వాదశనామాలు పఠిస్తూ, సూర్యుణ్ణి ప్రార్థనలు చేస్తే... ఆరోగ్య, ఆధ్యాత్మిక ప్రయోజనాలు చేకూరుతాయన్నది పెద్దల మాట.

• ఆయపిళ్ళ రాజపాప

వేడుక

వన వేలుపుల మహా జాతర

గిరిజనుల ఆరాధ్య దేవతలుగా, ఆపదలో ఉన్నవారిని ఆదుకొని, వారి కష్టాలు తీర్చే వేలుపులుగా వాసికెక్కారు సమ్మక్క, సారలమ్మ. ఆ వనదేవతలకు నిర్వహించే జాతర... తెలంగాణ కుంభమేళాగా ప్రసిద్ధి చెందింది. అంతేకాదు... ఇది ఆసియాలో అతి పెద్ద గిరిజన జాతర. మన దేశంలో కుంభమేళా తరువాత అత్యధికంగా భక్తులు హాజరయ్యే వేడుక. ఈ మహా జాతరకు ఇతర రాష్ట్రాల నుంచి కూడా గిరిజన, గిరిజనేతర భక్తులు భారీ సంఖ్యలో హాజరవుతారు.

రెండేళ్ళకొకసారి తెలంగాణలోని ములుగు జిల్లా తాడ్వాయి మండలం మేడారం గ్రామంలో... సమ్మక్క-సారక్క జాతరను జరుపుతారు. ఇది చారిత్రక ప్రాధాన్యం ఉన్న సంబరం. పదమూడో శతాబ్దంలో... నేటి జగిత్యాల మండల ప్రాంతంలోని పొలవాస లేదా పొలస ప్రాంతాన్ని గిరిజన దొర మేడరాజు పరిపాలించేవాడు. ఆయన తన కుమార్తె సమ్మక్కను మేనల్లుడైన మేడారం పాలకుడు పగిడిద్దరాజుకు ఇచ్చి వివాహం చేశాడు. ఆ దంపతులకు సారలమ్మ, నాగులమ్మ, జంపన్న అనే ముగ్గురు సంతానం కలిగారు. రాజ్యవిస్తరణ కాంక్షతో... కాకతీయ ప్రభువైన మొదటి ప్రతాపరుద్రుడు పొలవాస మీద దండెత్తాడు. ఆ దాడిని తట్టుకోలేక మేడరాజు... మేడారంలో అజ్ఞాతవాసం గడిపాడు. మరోవైపు కాకతీయులకు సామంతుడైన పగిడిద్దరాజు కరువు కారణంగా కప్పం కట్టలేకపోయాడు. కప్పం కట్టకపోవడంతోపాటు మేడరాజుకు ఆశ్రయం ఇచ్చినందుకు ఆగ్రహించిన కాకతీయ ప్రభువు మేడారంపై మీద సైన్యంతో విరుచుకుపడ్డాడు. భీకరంగా జరిగిన యుద్ధంలో... మేడరాజు, పగిడిద్దరాజు, సారలమ్మ, నాగులమ్మ, సారలమ్మ భర్త గోవింద రాజులు మరణించారు. ఈ వార్త విన్న జంపన్న సంపెగవాగులో దూకి ఆత్మహత్య చేసుకున్నాడు. అప్పటి నుంచి ఆవాగు 'జంపన్నవాగు'గా ప్రసిద్ధి చెందింది.

మరోవైపు కాకతీయ సైన్యాన్ని సమ్మక్క వీరోచితంగా ఎదుర్కొని పోరాడింది. అయితే ప్రత్యర్థుల బలం ఎక్కువ కావడంతో... చివరికి ఆమె గాయపడింది. రక్తధారలతో యుద్ధభూమి నుంచి చిలుకలగుట్ట వైపు వెళ్తూ... మార్గమధ్యంలో అదృశ్యమయింది. సమ్మక్క కోసం ఆమె అనుచరులు వెతుకుతూ వెళ్ళారు. వారికి ఆమె కనిపించలేదు కానీ... ఒక పుట్ట దగ్గర పసుపు, కుంకుమ ఉన్న భరిణె దొరికింది. దాన్ని సమ్మక్కగా భావించి... రెండేళ్ళకు ఒకసారి మాఘశుద్ధ పౌర్ణమి రోజున... సమ్మక్క-సారక్క జాతర నిర్వహిస్తున్నారు. వంశపారంపర్యంగా గిరిజనులే పూజారులుగా ఉంటారు. తమ కోర్కెలు తీర్చాలని అమ్మవార్లకు భక్తులు మొక్కుకుంటూ బంగారాన్ని (బెల్లాన్ని) నైవేద్యంగా సమర్పించుకుంటారు. వారి వీరత్వాన్ని స్మరించుకుంటారు.

వందల ఏళ్ళ చరిత్ర కలిగిన ఈ జాతరను నలభై వరకూ చిలకలగుట్ట మీద గిరిజనులు మాత్రమే నిర్వహించేవారు. ఆ తరువాత అన్ని వర్గాల ప్రజలూ పాల్గొంటున్నారు. జనసందోహం ఏటేటా పెరుగుతూ ఉండడంతో జాతరను కొండ కింద నిర్వహించడం మొదలుపెట్టారు. అమ్మవార్లకు చిహ్నాంగా గద్దెలు ఏర్పాటు చేశారు. అమ్మవార్లకు ప్రతిరూపాలైన కుంకుమ భరిణెలను జాతర సందర్భంగా గద్దెపైకి తీసుకువస్తారు. ఈ నాలుగు రోజుల జాతరలో తొలిరోజున కన్నెపల్లి నుంచి సారలమ్మను గద్దెపైకి తెస్తారు. ఆ మరునాడు చిలకలగుట్ట నుంచి సమ్మక్క గద్దెపైకి విచ్చేస్తుంది. మూడో రోజున భక్తులకు అమ్మవార్లు దర్శనమిస్తారు. చివరిరోజున అమ్మవార్లు తిరిగి వనప్రవేశం చేయడంతో జాతర ముగుస్తుంది.

ఫిబ్రవరి 21 : కన్నెపల్లి నుంచి సారలమ్మను, పునుగొండ్ల నుంచి పగిడిద్దరాజును, కొండాయి నుంచి గోవిందరాజును గద్దెలపైకి తీసుకువస్తారు.
ఫిబ్రవరి 22: చిలుకల గుట్ట నుంచి కుంకుమభరిణె రూపంలో ఉన్న సమ్మక్కను గద్దెపైకి తెస్తారు.
ఫిబ్రవరి 23: భక్తులు మొక్కులను చెల్లించుకుంటారు.
ఫిబ్రవరి 24: గద్దెలపై భక్తులకు దర్శనమిచ్చిన సమ్మక్క, సారలమ్మ వన ప్రవేశం.
ఫిబ్రవరి 28: తిరుగువారం పండుగ.



• నూతి శివానందం

*నేయ్ కృష్ణ - నవద్వీపే శ్రీ చైతన్య చంద్ర
నేయ్ బలరామ - సంగే శ్రీ నిత్యానంద*

"**శ్రీకృష్ణుడు** నవద్వీపంలో శ్రీ చైతన్య మహాప్రభువుగా అవతరించగా, వారితో పాటు బలరాముడు నిత్యానంద ప్రభువుగా అవతరించాడ"ని 'చైతన్య చరితామృతం' గ్రంథం చెబుతోంది. పశ్చిమబెంగాల్‌లోని ఏకచక్రధామంలో... 1473లో మాఘ శుద్ధ త్రయోదశి రోజున... హడాయ్ పండిత్, పద్మావతి దంపతులకు శ్రీనిత్యానంద జన్మించారు. ఆ రోజున ప్రపంచ వ్యాప్తంగా లక్షలాది హరేకృష్ణ భక్తులు శ్రీనిత్యానంద త్రయోదశి మహోత్సవాన్ని (ఈ ఏడాది ఫిబ్రవరి 22న) నిర్వహిస్తారు. శ్రీనిత్యానంద ప్రభువు ఆవిర్భావం గురించి 'వాయుపురాణం'లో బ్రహ్మదేవుడికి శ్రీకృష్ణుడు వివరిస్తూ "నా ప్రప్రథమ పరివ్యాప్త స్వరూపుడు, నాతో అభిన్నుడు అయిన బలరాముడు కూడా నిత్యానందునిగా నాతో పాటు భూలోకంలో అవతరించి... అవధూత శిఖామణిగా ప్రకాశిస్తాడు" అని తెలిపాడు.

> ఆది గురుతత్త్వ స్వరూపమైన శ్రీనిత్యానందుల కృప లేనిదే... శ్రీచైతన్యుల కృపకు ఎవరూ పాత్రులు కాలేరన్నది పూర్వాచార్యుల అభిప్రాయం.

మార్గదర్శకులు

త్రేతాయుగాన లక్ష్మణుడిగా శ్రీరామచంద్రుణ్ణి సేవించిన బలరాముడే... కలియుగ ధర్మమైన హరినామ సంకీర్తనా ఉద్యమంలో శ్రీచైతన్య మహాప్రభువుకు తోడ్పడేందుకు శ్రీనిత్యానంద రామునిగా అవతరించారు. అయితే మునుపటి అవతారాలకన్నా ఇది ఎంతో ప్రత్యేకమైనది. ఎందుకంటే... కృష్ణనామాన్ని గానం చేస్తూ, దాన్ని ప్రపంచమంతటా వ్యాపింపజేయడానికి ఒక విశుద్ధ భక్తుడిగా అవతరించడం దీని విశిష్టత. సామాజికంగా ఉన్నతులైనా ఆధ్యాత్మికంగా శోచనీయమైన స్థితిలో ఉన్నవారిని శ్రీ చైతన్యులు ఉద్ధరించి, కొన్నివేల మంది మాయావాద సన్యాసులకు విశుద్ధ భక్తిమార్గాన్ని చూపిస్తే... జగాయ్, మాదాయ్ లాంటి మ్లేచ్ఛులపైన సైతం శ్రీనిత్యానందులు కరుణ చూపి, వారిని ఉద్ధరించారు. ఈ ప్రయత్నంలో తన ప్రాణాలకే ప్రమాదం వాటిల్లినా... వెనుకంజ వేయలేదు. పతితులైనవారి మనస్సులను తన అపారమైన కృపతో, ఔదార్యంతో గెలిచి... వారిలో పరివర్తన తీసుకువచ్చారు. ఒక విధంగా శ్రీచైతన్య మహాప్రభువుకు కూడా సాధ్యం కానిది శ్రీనిత్యానంద ప్రభువు సాధించారు. అంతేకాదు... ఏకచక్రపురంలోని బంకిమరాయ మందిరంలో ఉన్న బంకిమరాయ విగ్రహంలో... శ్రీనిత్యానంద ప్రభువు ఐక్యమై, తన లీలలను చాలించారన్నది ఐతిహ్యం. ఆ విగ్రహానికి కుడివైపున జాహ్నవీదేవి, ఎడమవైపున రాధారాణి విగ్రహం దర్శనమిస్తాయి. పరమపవిత్రమైన నిత్యానంద త్రయోదశినాడు... ఆదిగురుతత్త్వమైన శ్రీనిత్యానందుల్ని ఆశ్రయించి అనుసరిద్దాం. శ్రీనిత్యానందుల కృప వల్ల 'హరేకృష్ణ' మంత్రాన్ని జపించేందుకు మరింత శక్తి మనకు లభిస్తుంది.

అవధూత శిఖామణి





శ్రీసత్యగౌర చంద్రదాస ప్రభూజీ
అధ్యక్షుడు, హరే కృష్ణ మూవ్‌మెంట్, హైదరాబాద్, 9396956984

విశేషం

*ప్రథమో హనుమన్నామః ద్వితీయో భీమ ఏవచ
పూర్ణ ప్రజ్ఞ తృతీయస్తు భగవత్కార్య సాధకః*

హనుమ, భీమ అవతారాల తరువాత వైష్ణవతత్త్వ యదార్థ రూపాన్ని పునఃప్రతిష్ఠించడానికి వాయుదేవుడు శ్రీమధ్వాచార్యులుగా అవతరించాడు. ఈ మూడు అవతారాలకు భేదం లేదని మనం గ్రహించాలి. పరమాత్మ, లక్ష్మీదేవి తరువాత సకల దేవతలలో ఉత్తముడు వాయుదేవుడు. అందుకే హరి సర్వోత్తముడైతే... వాయువు జీవోత్తముడు.

వేదప్రతిపాదితమైన వాయుదేవుడి మూడు అవతారాలను... శ్రీమధ్వాచార్యుల శిష్యుడైన శ్రీత్రివిక్రమ పండితాచార్యులు ప్రత్యక్షంగా దర్శించారు. ఒక రోజు మధ్వాచార్యులు ఎప్పటిమాదిరిగానే శ్రీకృష్ణునికి పూజ చేసి, నైవేద్య సమర్పణకు సిద్ధమైనప్పుడు... ఆయన శిష్యులు ద్వాదశ స్తోత్రాన్ని పఠించారు. స్తోత్ర పఠనం పూర్తయింది. నైవేద్య సమర్పణ ముగిసే సమయం వచ్చినా... మధ్వాచార్యులు చేసే ఘంటానాదం ఎంతసేపైనా వినబడలేదు. 'ఎందుకింత ఆలస్యమవుతోంది? ఆచార్యులవారు ఏం చేస్తూ ఉంటారు?' అనే కుతూహలంతో త్రివిక్రమ పండితారాధ్యులు మూసి ఉన్న తలుపును కొద్దిగా జరిపి, సందులోంచీ చూశారు. హనుమ, భీమ, మాధ్వ రూపాలతో శ్రీకృష్ణునికి తన గురువు పూజ చేస్తూ ఉండడం గమనించి... ఆనందాశ్చర్యాలతో మైమరచిపోయారు. ఏ తపస్సు చేసినా లభ్యం కాని ఆ అద్భుత దృశ్యాన్ని దర్శించి... ఆనందబాష్పాలు రాల్చారు. అప్రయత్నంగానే... సహజమైన శ్రేష్ఠకావ్యశైలిలో శ్రీమధ్వాచార్యుల అవతారత్రయాన్ని, రామ, కృష్ణ, వ్యాసత్రయరూపాన్ని వర్ణిస్తూ 'శ్రీహరివాయుస్తుతి'ని జగత్తుకు అందజేశారు. అది విన్న మధ్వాచార్యులు ప్రసన్నులై... స్వయంగా 'నరసింహనఖస్తుతి'ని రచించి, 'శ్రీహరివాయుస్తుతి'ని పఠించే సజ్జనులకు పూర్ణఫలాన్ని అనుగ్రహించారు.



జ్ఞాన కార్యసాధకుడు

శ్రీమధ్వాచార్యులు బదరీ క్షేత్రానికి వెళ్ళి, నారాయణుణ్ణి దర్శించారు. తన మొదటి గ్రంథమైన 'గీతాభాష్యాన్ని' రచించి, బదరీనాథుడికి సమర్పించారు. అర్జునుడికి శ్రీకృష్ణుడు భగవద్గీతను బోధిస్తున్నప్పుడు... కపిధ్వజుడిగా, భీముడిగా పూర్వావతారాల్లో ఆయన యుద్ధభూమిలో ఉన్నారు. అందుకే పరమాత్ముడే మెచ్చే విధంగా భగవద్గీతకు భాష్యం రాసే భాగ్యం ఆయనకు లభించింది.

శ్రీమధ్వాచార్యుల వ్యక్తిత్వం, తాత్త్వికత ఆయన రచించిన 37 గ్రంథాలలో సంపూర్ణంగా ప్రకటితమైంది. ఈ సంఖ్యలో మూడును, ఏడును కలిపి 'దశం' (పది)గా పరిగణిస్తారు. 'దశమతి' అంటే పూర్ణప్రజ్ఞులు... శ్రీ మధ్వాచార్యులు. అలాగే 'మూడూ ఇంటూ ఏడు' అంటే 21 అనేది మరో సంఖ్య. ఆనాడు మధ్వాచార్యులు తత్త్వవాదంతో పరిశీలించి, ఖండించిన సిద్ధాంతాల సంఖ్య అది. ఆయన బ్రహ్మసూత్రభాష్యం

> ఉడుపిలోని అనంతేశ్వర ఆలయంలో తన శిష్యులకు పాఠాన్ని బోధిస్తూ... అదృశ్యులై, వేదవ్యాసుని బదరికాశ్రమానికి శ్రీమధ్వులు చేరుకున్న రోజు... మాఘ శుద్ధ నవమి. దానినే సద్భక్తులందరూ 'మధ్వనవమి'గా జరుపుకొంటారు. ఆ పుణ్యదినాన శ్రీమధ్వాచార్యుల మహిమలను, ఆయన మానవాళికి అందించిన తత్త్వవాదాన్నీ శక్తి కొద్దీ స్మరిస్తే... శ్రీహరి కరుణకు పాత్రులవుతాము.

ఇరవై రెండవది. ఋగ్వేదంలోని ప్రథమ మండలంలో ఉన్న నలభై సూక్తాలకూ వేదార్థాల్ని వివరిస్తూ వ్యాఖ్యానం రాసి, వేదంలోని ప్రతి శబ్దార్థమూ శ్రీమహావిష్ణువును ఉద్దేశించినదేనని మధ్వాచార్యులు నిరూపించారు. వేద, ఉపనిషత్తులలోని పరమాత్ముని తత్త్వజ్ఞాన సందేశాన్ని ప్రపంచానికి అందజేశారు.

• మధ్వ ప్రచార పరిషత్, 9440258841

బాధ్యతలు స్వీకరించిన డీఎస్పీ

మెట్‌పల్లి, ఫిబ్రవరి, 15 : మెట్‌పల్లి డీఎస్పీగా ఉమామహేశ్వరరావు గురువారం బాధ్యతలు స్వీకరించారు. గతంలో ఇక్కడ పనిచేసిన వంగ రవీందర్‌రెడ్డిని హైదరాబాద్‌లోని డీజీపీ కార్యాలయానికి బదిలీ కావడంతో ఆయన స్థానంలో ఉమామహేశ్వరరావు బాధ్యతలు స్వీకరించారు. గతంలో హైదరా బాద్‌లోని సైబర్ క్రైమ్ డీఎస్పీగా పనిచేసిన ఉమామహేశ్వరరావు రాష్ట్ర ప్రభుత్వం మెట్‌పల్లి డీఎస్పీగా నియమించడంతో ఆయన బాధ్యతలు స్వీకరించారు. ఆయన మాట్లాడుతూ లా అండ్ ఆర్డర్‌ను కాపాడేందుకు ప్రతి ఒక్క రూ సహకరించాలన్నారు. నిత్యం ఆఫీస్‌లో అందుబాటులో ఉంటానని, ప్రజలకు ఏ సమస్యలు ఉన్న నేరుగా సంప్రదించాలన్నారు. అనంతరం మెట్‌పల్లి సీఐ లక్ష్మీనారాయణ, ఎస్సైలు, సిబ్బంది కలిసి స్వాగతం పలికారు.

ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్ అరెస్టు హేయమైన చర్య

బీఎస్పీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పుప్పాల లింబాద్రి

మెట్‌పల్లి, ఫిబ్రవరి, 15 : రంగారెడ్డి జిల్లా చేవెళ్ల నియోజక వర్గంలోని జన్వాడ గ్రామంలో క్రైస్తవులను పరామర్శించడానికి వెళ్లిన బహుజన సమాజ్ పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్‌ను అరెస్టు చేయడం హేయమైన చర్యని బీఎస్పీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పుప్పాల లింబాద్రి ఖండించారు. గురువారం పట్టణంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ మైనార్టీ, దళిత వర్గాలు స్త్రీలు, పురుష బేదం లేకుండా మనువాద ముసుగులో గుండాలు దాడి చేయడాన్ని త్రీవంగా ఖండిస్తున్నమన్నారు. మతం ముసుగులో రాజ్యాంగం కల్పించిన హక్కులను కలరాస్తూ చట్టాన్ని చేతిలోకి తీసుకోని దాడి చేసిన వారిని వెంటనే అరెస్టు చేసి నాన్ బెయిలబుల్ కేసు నమోదు చేయాలన్నారు. గాయపడిన వారిని పరామర్శించడానికి వెళ్తున్న ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్‌ను అక్రమంగా అరెస్టు చేయడాన్ని వ్యతిరేకిస్తున్నమన్నారు. ఇలాంటి పరిణామలు చోటు చేసుకుంటే రాబోయే కాలంలో బలహీన వర్గాలకు చెందిన అందరూ ఏదురు తిరిగి పోరా టం చేస్తామన్నారు. జరిగిన సంఘటనాలకు బీజేపీ పార్టీ బాధ్యత వహిం చలన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు గొర్రె భీమన్న, అమర్, సురాజ్, నవీన్, బద్రి పాల్గొన్నారు.

ఘనంగా సంత్ సేవాలాల్ జయంతి వేడుకలు

పెగడపల్లి, ఫిబ్రవరి 15 : పెగడపల్లి మండలంలో గురువారం సంత్ సేవాలాల్ జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. గిరిజనుల ఆరాధ్య దైవమైన సంత్ సేవాలాల్ జయంతిని పురస్కరించుకుని మండలంలోని గిరిజన లంబాడా తండాలలో సంత్ సేవాలాల్ చిత్రపటంతో శోభాయాత్ర నిర్వహించారు. కార్యక్రమంలో ఏడుమోటలపల్లి మాజీ సర్పంచ్ ఇస్లావత్ రవి నాయక్, తిరుపతి నాయక్, అంజీ నాయక్, రాములు నాయక్, సామానాయక్, కాంగ్రెస్ మండల నాయకులు రాములు గౌడ్, శ్రీనివాస్ పాల్గొన్నారు.

కొడిమ్యాల: మండలంలోని గంగారాంతండా గ్రామంలో గురువారం సంతు సేవాలాల్ మహారాజ్ జయంతి వేడుకలను తండావాసులు ఘనంగా నిర్వహించారు. ఆయన చిత్ర పటానికి పూజలు చేశారు. ఈ కార్యక్రమంలో గ్రామ మాజీ సర్పంచు బోజ్యానాయక్, మాజీ ఉప సర్పంచు కిషన్, గ్రామ ప్రముఖులు రాజు, లక్ష్మన్, కుల సంఘ పెద్దలు, మహిళలు పాల్గొన్నారు.

మెట్‌పల్లి రూరల్ : బంజారాల ఆరాధ్య దైవం సంత్ సేవాలాల్ మహరాజ్ వేడుకలు మండలంలోని అల్లూరి సీతారామతండాలో గిరిజనులు ఘనంగా జరుపుకున్నారు. గురువారం గిరిజనలు భక్తి శ్రద్ధలతో తయారు చేసిన పిండి వంటాలను సమర్పించి ప్రత్యేక పూజలు జరిపి మొక్కులు చెల్లించుకున్నారు. ఈ సందర్భంగా గిరిజనలు సాంప్రదాయ వేషధారణలో నృత్యాలు చేసి వేడుకలను ఘనంగా జరుపుకున్నారు.

మల్లాపూర్, ఫిబ్రవరి, 15 : మండల కేంద్రంతో పాటు సిర్పూర్, వేంపల్లి తదితర గ్రామాల్లో గురువారం సంత్ సేవాలాల్ జయంతి వేడుకలను ఘనంగా జరిపారు. ఈ సందర్భంగా సిర్పూర్ గ్రామంలో ఏర్పాటు చేసిన బంజార నృత్యం పలువురిని ఆకర్షింప జేసింది. వేంపల్లిలో మల్లాపూర్ తహసీల్దార్ వీర్‌సింగ్‌ను నాయకులు, గిరిజనలు సన్మానించారు.

కాంగ్రెస్ ఆరు గ్యారంటీలను అమలు చేస్తుంది



దరఖాస్తులను స్వీకరిస్తున్న కౌన్సిలర్

కోరుట్ల, ఫిబ్రవరి 15 : రేవంత్‌రెడ్డి నాయకత్వంలోని కాంగ్రెస్ ప్రభుత్వం ఆరు గ్యారంటీలను రాష్ట్రంలో అమలు చేస్తుందని పట్టణంలోని 15వ వార్డు కౌన్సిలర్ ఆడెపు కమలమధు పేర్కొన్నారు. పట్టణంలోని హాజీపురలో ఉర్దూ ఘర్‌లో గృహజ్యోతికి సంబంధించి 200 యూనిట్ల ఉచిత విద్యుత్ దరఖాస్తుల ఆన్‌లైన్ ప్రక్రియను గురువారం పరిశీలించారు. రాష్ట్రంలో ఇప్పటికే రెండు గ్యారంటీలను ప్రభుత్వం అమలు చేసిందని మరో రెండు గ్యారంటీలను అమలు చేసే కసరత్తు జరుగుతోందన్నారు. ఇందిరమ్మ ఇళ్ళ నిర్మాణాలు కూడా చేపట్టి నిరుపేదల జీవితాల్లో వెలుగులు నింపేందుకు సీఎం రేవంత్‌రెడ్డి కృషి చేస్తున్నారని అన్నారు. ఈ సందర్భంగా ఏఈ శ్యామ్, లైన్‌మెన్ గంగాధర్, ఎండీ నజీమోద్దీన్, మీర్జా, ముక్రాం తదితరులు ఉన్నారు.

అల్పాహారం అందజేత



అల్పాహారం అందిస్తున్న లయన్స్‌క్లబ్ సభ్యులు

కోరుట్ల, ఫిబ్రవరి 15 : లయన్స్ క్లబ్ ఇంటర్నేషనల్ డిస్ట్రిక్ 320జీ వారి ఆధ్వర్యంలో మీల్స్ ఆన్ వీల్స్ కార్యక్రమంలో భాగంగా గురువారం ఉచిత అల్పాహారం అందించారు. సివిల్ ఆసుపత్రి ఆవరణలో సుమారు 150 మందికి ఉచిత అల్పాహారం పంపిణీ చేశారు. క్లబ్ అధ్యక్షుడు వనపర్తి చంద్రమోహన్, జిల్లా హంగర్ రిలీఫ్ కోర్ టీం సభ్యురాలు ఉషాకిరణ్ మాట్లాడుతూ ప్రస్తుతం అల్పాహారం అందిస్తుండగా భవిష్యత్‌లో భోజనం ఏర్పాటు చేస్తామన్నారు. గుంటుక చంద్రప్రకాశ్‌కవిత దంపతులు ఆర్థిక సాయం అందించారు. ఈ కార్యక్రమంలో ఆసుపత్రి సూపరింటెండెంట్ వేముల సునీత, అల్లాడి ప్రవీణ్, చాప కిషోర్, పోతని ప్రవీణ్, అల్లాడి శోభ, కుందారపు ప్రేమలత, కటుకం శంకర్ తదితరులు ఉన్నారు.

పారిశుధ్యంపై గ్రామ సభలు

బీర్‌పూర్,ఫిబ్రవరి 15: మండలంలోని 15 గ్రామ పంచాయతీలలో గురువారం ప్రత్యేక అధికారుల ఆధ్వర్యంలో గ్రామ సభలు నిర్వహించారు. ఈ సందర్భంగా అన్ని గ్రామాలలో ఇటీవల జరిగిన పారిశుధ్యం పనులపై సూదీర్ఘమైన చర్చలు జరిపి, గ్రామాలలో చేయవలసిన అభివృద్ధి పనులను గూర్చి గ్రామ సభలలో తీర్మానాలు చేసి ఆమోదించారు. పలు గ్రామాలలో జరిగిన నిధుల దుర్వినియోగంపై గ్రామస్తులు సభలో ప్రత్యేక అధికారుల దృష్టికి తీసుకువెళ్లారు. గ్రామ పంచాయతీ సిబ్బందిని శాలువాలు కప్పి సన్మానించారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ మసర్తి రమేష్, జెడ్పీటీసీ పాత పద్మ రమేష్, వైస్ ఎంపీపీ బల్మూరి లక్ష్మన్ రావ్, అన్ని గ్రామాల ప్రత్యేక అధికారులు, ఎంపీటీసీలు, కార్యదర్శులు, అంగన్‌వాడీ టీచర్లు, కారోబార్లు పాల్గొన్నారు.

పిల్లలందరికీ పోలియో చుక్కలు వేయాలి

సిరిసిల్ల కలెక్టరేట్, ఫిబ్రవరి 15 : పుట్టిన పిల్లలనుంచి ఐదు సంవత్సరాల లోపు పిల్లలందరికీ పోలియో చుక్కలు వేయాలని జిల్లా డిప్యూటీ వైద్యాధికారి డాక్టర్ రజిత కోరారు. సిరిసిల్ల జిల్లా కలెక్టరేట్‌లో గురువారం వైద్యాఆరోగ్య శాఖ అధ్వర్యంలో పల్‌పోలియో కార్యక్రమాలపై ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల వైద్యాధికారులు, ఆరోగ్య పర్యవేక్షకులకు కరీంనగర్ డబ్ల్యూహెచ్‌వో కో- ఆర్డినేటర్ డాక్టర్ అతుల్ నిగమే శిక్షణ అందించారు. ఈ సందర్భంగా డాక్టర్ రజిత మాట్లాడుతూ మార్చి 3, 4, 5వ తేదీల్లో పిల్లందరికి పల్స్ పోలియో చుక్కలు ఇంటికి వెళ్లి వేయాలని సూచించారు. సమావేశంలో డిప్యూటీ డీఎంహెచ్‌వో డాక్టర్ శ్రీరాములు, డాక్టర్ నాయిమ్‌జాన్ పాల్గొన్నారు.

పారిశుధ్య కార్యక్రమాలు నిరంతరం కొనసాగాలి



అంబారిపేటలో పారిశుధ్య కార్మికులకు సన్మానం చేస్తున్న ప్రజాప్రతినిధులు

పెగడపల్లి, ఫిబ్రవరి 15 : గ్రామాలలో పారిశుధ్య కార్యక్రమాలు నిరంతరం కొనసాగాలని ఎంపీడీవో శ్రీనివాసరెడ్డి పేర్కొన్నారు. ప్రత్యేక పారిశుధ్య వారోత్సవాల ముగింపు రోజు గురువారం మండల కేంద్రమైన పెగడపల్లి గ్రామపంచాయతీలో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్లాస్టిక్ వాడకాన్ని తగ్గించేలా ప్రజలకు అవగాహన కల్పించాలని, రాబోవు వేసవిలో తాగునీటి ఎద్దడి రాకుండా ప్రణాళిక సిద్ధం చేయాలన్నారు. ఈ సందర్భంగా మండలంలోని అన్ని గ్రామాలలో ఆయా గ్రామాల ప్రత్యేకాధికారుల ఆధ్వర్యంలో సమావేశాలు నిర్వ హించారు. సమావేశాలలో ఎంపీవో మహేందర్, ఎంపీటీసీ బొమ్మెన జమునస్వామి, మాజీ సర్పంచ్ మేరుగు శ్రీనివాస్, పంచాయతీ కార్యదర్శులు, అంగన్‌వాడీ టీచర్లు, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

కొడిమ్యాల: మండలంలోని వివిధ పంచాయతీ కార్యాలయాలలో గురువారం గ్రామ సభలను నిర్వహించి పారిశుద్ధ్య సిబ్బందిని ప్రత్యేక అధికారులు, కార్యదర్శులు శాలువాలు కప్పి ఘనంగా సన్మానించారు. యువత గంజాయి, మత్తు పదార్థాలను సేవించడం వలన కలుగు అనర్థా లను వివరించారు. గంజాయి, మత్తు పదార్థాలను వినియోగించె వారిపై ప్రభుత్వం తీసుకునె చర్యలను వివరించారు. ఈ కార్యక్రమాలలో ఆయా గ్రామాల ప్రత్యేక అధికారులు ఎంపీడీవో స్వరూప, తహసీల్దార్ రాజమణి, వెటర్నరీ వైద్యుడు ప్రసాద్, ఎంపీవో ప్రవీణ్, కార్యదర్శులు గ్రామాల ప్రముఖులు, మాజీ ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

మల్యాల: ప్రత్యేక పారిశుధ్య కార్యక్రమం ముగింపు సందర్భంగా గ్రామ పంచాయితీ సిబ్బందిని మల్యాలలో అధికారులు సన్మానించారు. అనంతరం వారికి దుస్తులను పంపిణీ చేశారు. కార్యక్రమంలో భాగంగా చేపట్టిన పనులను గ్రామసభలో తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రత్యేక అధికారి సురేష్‌కుమార్, పంచాయితీ ఈవో గుండేటి రవీందర్, తిరుపతి, వెంకటేష్ వినయ్ పాల్గొన్నారు

కథలాపూర్ : ప్రభుత్వం గ్రామాల్లో ప్రత్యేక పారిశుధ్య కార్యక్రమాలు



నల్లగొండలో సిబ్బందిని సన్మానిస్తున్న అధికారులు



దుస్తులు అందించిన అనంతరం సిబ్బందితో అధికారులు

గత వారం రోజులుగా నిర్వహిస్తున్న నేపథ్యంలో గురువారం కార్యక్రమాలు ముగిశాయి. ముందుగా నిర్ణయించుకున్న మేరకు పనులను పూర్తి చేసుకోగా పారిశుధ్య కార్మికులను ప్రజాప్రతినిధులు శాలువాలతో సన్మానించారు. గ్రామ సభ ఏర్పాటు చేసుకుని వారం రోజులుగా చేపట్టిన పనుల వివరాలను ప్రభుత్వానికి నివేదించారు. ఈ కార్యక్రమాల్లో ప్రత్యేకాధికా రులు, పంచాయతీ కార్యదర్శులు, కారోబార్లు ఉన్నారు.

జగిత్యాలరూరల్ : జగిత్యాల రూరల్ మండలం మోరపల్లి, లక్ష్మీపూర్ గ్రామాల్లో ప్రత్యేక పారిశుధ్య కార్యక్రమం విజయవంతంగా పూర్తి చేసిన సందర్భంగా గ్రామపంచాయితీ కార్యదర్శులు రాజిరెడ్డి, అజయ్‌తో పాటుగా సిబ్బందిని ఘనంగా సన్మానించారు. ఈకార్యక్రమంలో ప్యాక్స్ చైర్మన్ మహిపాల్‌రెడ్డి, ఎక్సైజ్‌శాఖ సబ్‌ఇన్‌స్పెక్టర్ మేఘమాల, వెటర్నరీలైవ్‌స్టాక్ ఆఫీసర్ పూర్ణచందర్, ఎంపీటీసీ భూమారెడ్డి, అంగన్‌వాడీటీచర్లు, ఆశావర్కర్లు పాల్గొన్నారు.

అగ్రిమెంట్ ప్రకారం రైతులకు న్యాయం చేయాలి

కార్యాయాలనికి తాళం వేసిన రైతులు



తాళం వేసి నిరసన తెలుపుతున్న రైతులు

మెట్‌పల్లి, ఫిబ్రవరి, 15 : గాయత్రి షుగర్ ఫ్యాక్టరీ నిర్వహకులు రైతులకు ఇచ్చిన అగ్రిమెంట్ ప్రకారం న్యాయం చేయాలని రైతులు గురువారం నిరసన తెలిపారు. చెరుకు డబ్బులు ఇవ్వాలని, చెరుకు కటింగ్ చేయడానికి కూలీలను పంపించకుండా రైతులను మోసం చేస్తున్నారని ఆరోపిస్తూ గురువారం మెట్‌పల్లి లోని గాయత్రి షుగర్ ఫ్యాక్టరీ కార్యాలయంలో సిబ్బందిని ఉంచి బయట నుంచి తాళం వేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మల్లాపూర్ మండలంలోని రాఘవపేట గ్రామంలోని 20మంది చెరుకు రైతులతో కామారెడ్డిలోని గాయత్రి షుగర్ ఫ్యాక్టరీ వారు రెండేళ్ల క్రితం 22 ఎకరాలలో చెరుకు పంట పండిచాలని, అలాగే చెరుకు కటింగ్ చేయడానికి అగ్రిమెంట్ చేసుకున్నారన్నారు. గత సంవత్సరంలో చెరుకు కటింగ్ అయిన దానిని కామారెడ్డికి తరలించకుండా ఖమ్మంలోని ఫ్యాక్టరీకి తరలించారన్నారు.

అమ్మిన చెరుకు డబ్బులు ఇప్పటికీ రాలేవని, ప్రస్తుతం సంవత్సరం చెరుకును కటింగ్ చేయడానికి కూలీలను పంపించకుండా కాలం వెళ్లదీస్తున్నారన్నారు. దీంతో పది రోజుల్లో షుగర్ ఫ్యాక్టరీ మూసి వేస్తారని అక్కడి నిర్వాహకులు తెలుపుతున్నప్పటికి ఇక్కడి నిర్వాహకులు నిర్లక్ష్యం చేయడంతో కార్యాలయానికి తాళం వేశామన్నారు.

ఇప్పటికైనా పండించిన చెరుకును కటింగ్ చేయడానికి కూలీలను పంపించడం, కొనుగోలు చేసిన చెరుకు డబ్బులు ఇప్పించాలని డిమాండ్ చేసినట్లు తెలిపారు. తాళం వేసిన వారిలో రాఘవపేట గ్రామ రైతులు ఉన్నారు.

పాడి కౌశిక్‌రెడ్డి దిష్టిబొమ్మ దహనం



కౌశిక్‌రెడ్డి దిష్టిబొమ్మ దహనం చేస్తున్న కాంగ్రెస్ నాయకులు

మల్యాల, ఫిబ్రవరి 15: మంత్రి పొన్నం ప్రభాకర్‌గౌడ్‌ను దూషించడాన్ని నిరసిస్తూ మండల కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో హుజూరాబాద్ ఎమ్మెల్యే పాడి కౌశిక్‌రెడ్డి దిష్టిబొమ్మ గురువారం దహనం చేశారు. బీఆర్ఎస్ ప్రజాప్రతినిధులు అధికారం కోల్పోవడం జీర్ణియించుకోవడం లేదని అందుకే దూషణలు చేస్తున్నారంటూ మండిపడ్డారు. తీరు మార్చుకోవాలని హితవు పలికారు. ఆనందరెడ్డి, ఆదిరెడ్డి, లక్ష్మారెడ్డి, ముత్యం శంకర్, సతీష్‌రెడ్డి, ప్రకాష్‌రెడ్డి, మారుతీ, హుస్సెన్, సాయి పాల్గొన్నారు

సెల్‌ఫోన్ అప్పగింత

మల్యాల, ఫిబ్రవరి 15: కొండగట్టు అంజన్న దర్శనానికి వచ్చిన సుల్తానాబాద్‌కు చెందిన అభిజిత్‌రావ్ అనే భక్తుడు పోగొట్టుకున్న ఐఫోన్ దేవస్థానం పరిధిలోని పారిశుధ్య సిబ్బందికి దొరకడంతో భక్తుడికి అప్పగించారు. కారు వద్ద ఫోన్ లభించడంతో సిబ్బంది పోలీస్ అవుట్‌పోస్ట్‌లో ఏఎస్సై చిలుక శ్రీనివాస్‌కు అప్పగించడంతో విచారణ జరిపి భక్తునికి అందించారు.

మాజీ ఎమ్మెల్యే పరామర్శ



కొండగట్టులో పరామర్శిస్తున్న రవిశంకర్

మల్యాల, ఫిబ్రవరి 15: మండలంలోని కొండగట్టు, ముత్యంపేటకు చెందిన బొమ్మకంటి భూమయ్య, చెన్నవేని అజయ్, బద్దం నవీన, కట్కూరి నరేష్ తక్కళ్లపల్లిలో మరొకరు ఇటీవల మృతి చెందగా మృతుల కుటుంబాలను మాజీ ఎమ్మెల్యే సుంకె రవిశంకర్ గురువారం పరామర్శించారు. ఆయన వెంట మాజీ సర్పంచ్‌లు బద్దం తిరుపతిరెడ్డి, మిట్టపెల్లి సుదర్శన్, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు జనగాం శ్రీనివాస్, కొండగట్టు డైరెక్టర్ కొంక నర్సయ్య, గుర్రం మల్లేశంగౌడ్, పంజాల మల్లేశంగౌడ్, శ్రీనివాస్‌గౌడ్, త్రినాథ్, శివగౌడ్, శ్రీనివాస్ ఉన్నారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

ధర్మపురి, ఫిబ్రవరి 15: ధర్మపురి పట్టణంలోని పలు వీధుల్లో ఈ నెల 16న ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 4 వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం కలుగుతుందని ట్రాన్స్‌కో ఏఈఈ రవికుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. ధర్మపురి పట్టణంలో హనుమాన్‌వాడ, బోయవాడ, హరిత హోటల్‌రోడ్డు, మంగలిగడ్డ, సాయిబాబా టెంపుల్ రోడ్డు, హరిత నుండి నందిచౌక్ వరకు గల మెయిన్ రోడ్డు, హరిత హోటల్ పరిధిలో సప్లై అంతరాయం కలుగుతుందని ఆయన పేర్కొన్నారు. వినియోగదారులు సహకరించాలని ఆయన కోరారు.

విద్యార్థులకు పరీక్ష ప్యాడ్‌ల పంపిణీ

రాయికల్, ఫిబ్రవరి 15: మండలంలోని మైతాపూర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పదవ తరగతి చదువుతున్న విద్యార్థులకు సహృదయ్ ఫౌండేషన్ చైర్మన్ గంగుల శ్రీనివాస్ పరీక్ష ప్యాడ్‌లు, పెన్నులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులకు మావంతుగా ఇలా సహకారం అందించామని, పాఠశాల అభివృద్ధిలో గ్రామస్తులందరూ భాగస్వాములై ప్రభుత్వ పాఠశాలల్లో ముందంజలో ఉంచాలని అన్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయుడు మోహన్ రెడ్డి, నాయకులు మహిపాల్, మనోజ్ పాల్గొన్నారు.

రాష్ట్ర స్థాయి కబడ్డీ పోటీలకు ఎంపిక

సిరిసిల్ల రూరల్, ఫిబ్రవరి 15: సిరిసిల్ల పట్టణంలోని వెంకంపేట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 9వ తరగతి చదువుతున్న కుల్ల అశ్విత రాష్ట్ర స్థాయి కబడ్డీ పోటీలకు ఎంపికైందని పాఠశాల పీఈటీ సాన బాబు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లా కబడ్డీ అసోషియేషన్ సబ్ జూనియర్ విభాగంలో కుల్ల అశ్విత ఈ నెల 16నుంచి 19వ తేదీవరకు సూర్యాపేట జిల్లాలోని మల్లారెడ్డిగూడెంలో జరిగే 33వ సబ్ జూనియర్ కబడ్డీ రాష్ట్ర స్థాయి పోటీలలో పాల్గొంటుందని తెలిపారు. ఇటీవల జిల్లా కేంద్రంలో జరిగిన జిల్లా స్థాయి కబడ్డీ పోటీల్లో అత్యంత ప్రతిభ కనబరిచి రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికన అశ్వితను మండల విద్యాధికారి దూస రఘుపతి, ఇన్‌చార్జి హెచ్ఎం పోలాస మల్లేశం, జిల్లా కబడ్డీ అసోషియేషన్ కార్యదర్శి ఎస్ఎస్ తిరుపతి, కౌన్సిలర్ కల్లూరి రాజు అభినందించారు.

కార్మికుల సమ్మెలో భాగస్వాములు కావాలి

మెట్‌పల్లి రూరల్, ఫిబ్రవరి, 15: కార్మికుల సమ్మెలో భాగంగా 16న మెట్‌పల్లి పట్టణంలో నిర్వహించే ర్యాలీలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని అంగన్‌వాడీ టీచర్స్ హెల్పర్స్ రాష్ట్ర అధ్యక్షురాలు సాయిశ్వరి కోరారు. గురువారం ఆమె విలేకరులతో మాట్లాడుతూ దేశ వ్యాప్త సమ్మెలో భాగంగా పట్టణంలోని వ్యవసాయ మార్కెట్ నుంచి జాతీయ రాహదారి మీదుగా ఆర్డీవో ఆఫీసు వరకు ర్యాలీ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. డివిజన్‌లోని మెట్‌పల్లి, మల్లాపూర్, ఇబ్రహీంపట్నం, కథలపూర్ మండలలాతో పాటు కోరుట్ల డివిజన్ పరిధిలోని అంగన్‌వాడీ టీచర్లు, హెల్పర్స్‌తో పాటు కార్మికులు పాల్గొనాలని పిలుపునిచ్చారు.

గ్రామీణ భారత్‌బంద్‌లో పాల్గొనాలి

మెట్‌పల్లి, ఫిబ్రవరి, 15: ఏఐసీసీ ఆదేశాల మేరకు సంయుక్త కిసాన్ మోర్చా కార్మిక సంఘాలు ఇచ్చిన దేశ వ్యాప్త సమ్మెకు నియోజకవర్గంలోని అన్ని మండలాలలోని అధ్యక్షులు, నాయకులు పాల్గొనాలని కాంగ్రెస్ పట్టణాధ్యక్షుడు జెట్టి లింగం, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు అల్లూరి మహేందర్‌రెడ్డి పిలుపునిచ్చారు. గురువారం పట్టణంలోని పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో వారు మాట్లాడుతూ దేశ వ్యాప్తంగా మోదీ అనుసరిస్తున్న రైతు వ్యతిరేక, కార్మిక విధానాల వల్ల రైతులు, కార్మికులు తీవ్రంగా నష్టపోతున్నరన్నారు. మెట్‌పల్లిలో నిర్వహించే ర్యాలీలో ప్రతి ఒక్కరూ పాల్గొనాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో పిడుగు తిరుపతిరెడ్డి, అంజిరెడ్డి, మారుతి, సంతోష్ రెడ్డి, సంజీవ్‌రెడ్డి, రాంప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

అంతర్గత మార్కుల పరిశీలన

రాయికల్, ఫిబ్రవరి 15: మండలంలోని ఇటిక్యాల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పదవ తరగతి విద్యార్థుల అంతర్గత మార్కులను గురువారం పర్యవేక్షకులు పరిశీలించారు. ఈ కార్యక్రమంలో పర్యవేక్షణాధికారి బోగ రమేష్, సభ్యులు బొమ్మకంటి రవి కుమార్, మండలోజు రవీందర్, ప్రధానోపాధ్యాయుడు సదాశివ్, ఉపాధ్యాయులు రాజేశం, మహేశ్వర్ శర్మ, రమేష్, శాంత కుమారి, జియావోద్దీన్, హన్మంతరావు తదితరులు పాల్గొన్నారు.

రాయికల్ ఎంపీడీవోగా చిరంజీవి బాధ్యతల స్వీకరణ

రాయికల్, ఫిబ్రవరి 15: రాయికల్ ఎంపీడీవోగా బి.చిరంజీవి గురువారం బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ పని చేసిన ఎంపీడీవో గంగుల సంతోష్ కుమార్ నిజామాబాద్‌కు బదిలీపై వెళ్లారు. ఆయన స్థానంలో రాజన్న సిరిసిల్ల జిల్లా ఎల్లారెడ్డిపేట ఎంపీడీవోగా విధులు నిర్వహిస్తున్న చిరంజీవి రాయికల్ ఎంపీడీవోగా బాధ్యతలు స్వీకరించారు.

టీయూఎఫ్ఐడీసీ నిధులు విడుదల చేయాలి

● అసెంబ్లీలో ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్

మెట్‌పల్లి, ఫిబ్రవరి, 15: కోరుట్ల నియోజక వర్గం అభివృద్ధికి గత ప్రభుత్వం హయాంలో మంజూరు చేసిన టీయూఎఫ్ఐడీసీ నిధులు, కోరుట్ల ఆసపత్రిలోని డయాలసిస్ సెంటర్‌కు మరిన్ని పరికరాలను అందజేయాలని అసెంబ్లీ సమావేశంలో కోరినట్లు ఎమ్మెల్యే డాక్టర్ కల్వకుంట్ల సంజయ్ తెలిపారు. గురువారం జరిగిన అసెంబ్లీ సమావేశంలో కోరుట్ల నియోజక వర్గం సమస్యలపై జీరో అవర్‌లో రాష్ట్ర ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లినట్లు ఆయన తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో గెలిపొందిన తరువాత మొదటిసారి అసెంబ్లీ సమావేశాలకు హాజరైనట్లు తెలిపారు.

నియోజక వర్గంలోని అభివృద్ధి పనులకు గత బీఆర్ఎస్ ప్రభుత్వం మంజూరు చేసిన టీయూఎఫ్ఐడీసీ నిధులను ప్రస్తుతం రాష్ట్ర ప్రభుత్వం నిలిపివేయనుందన్నారు. నియోజక వర్గంలోని కిడ్నీ బాధితుల కోసం కోరుట్ల ఏర్పాటు చేసిన డయాలసిస్ సెంటర్‌కు రోగుల సంఖ్య పెరిగి నందున మరిన్ని మిషిన్‌ల ను పెంచి కిడ్నీ బాధితులను అందుకోవాలని సంబంధిత వైద్య శాఖ మంత్రికి వినతిపత్రం అందజేయడంతో పాటు అసెంబ్లీ సమావేశంలో సభ దృష్టికి తీసుకెళ్లామన్నారు. నియోజక వర్గంలో ఉన్న షుగర్ ఫ్యాక్టరీ పరిశ్రమపై కమిటీ వేసినట్లు పేపర్‌లో చదవడం జరిగిందని, కమిటీ వివరాలను తెలిపాలని ప్రభుత్వాన్ని కోరడంతో పాటు చెరుకు రైతుల ప్రయోజనా లను కాపాడాలన్నారు.

ధర్మపురి ఎంపీడీవోగా రవీందర్

ధర్మపురి, ఫిబ్రవరి 15: ధర్మపురి మండల ప్రజా పరిషత్ ఎంపీడీవోగా పి. రవీందర్ గురువారం పదవీ భాధ్యతలు స్వీకరించారు. గతంలో ఇక్కడ ఎంపీ డీవోగా పని చేసిన ప్రవీణ్‌కుమార్ ధర్మారానికి బదిలీ అయ్యారు. ఆయన స్థా నంలో రాజన్న సిరిసిల్ల జిల్లా చందుర్తిలో పని చేస్తున్న రవీందర్ ఇక్కడికి బదిలీపై వచ్చి పదవీ భాధ్యతలు స్వీకరించారు. ఎంపీడీవో రవీందర్‌ను ఉద యం ఎంపీపీ ఎడ్ల చిట్టిబాబు ఆధ్వర్యంలో మండల ప్రజా పరిషత్ ఉద్యోగులు మర్యాద పూర్వకంగా కలిసి శాలువా కప్పి సన్మానించారు. ధర్మపురి ఎంపీవో నరేష్‌కుమార్, సీని యర్ అసిస్టెంట్ అజయ్‌కుమార్‌రెడ్డి, జూనియర్ అసిస్టెంట్ శ్రీధర మహేష్, నరేష్ పాల్గొన్నారు.

ఎస్ఐగా ఉదయ్‌కుమార్

ధర్మపురి ఎస్సైగా ఉదయ్‌కుమార్ గురువారం భాధ్యతలు స్వీకరించారు. గతంలో ఇక్కడ ఎస్సైగా పనిచేసిన దత్తాత్రి జగిత్యాలకు బదిలీ అయ్యారు. ఆయన స్థానంలో నిజామాబాద్ జిల్లా రేంజల్ ఎస్ఐగా పనిచేసిన ఉదయ్ కుమార్ అక్కడి నుంచి బదిలీపై వచ్చి విధుల్లో చేరారు. అంతకు ముందు ఎస్సై ఉదయ్‌కుమార్ సీఐ రాంనర్సింహారెడ్డిని మర్యాద పూర్వకంగా కలిశారు.

బుగ్గారం : ఎస్సైగా బాధ్యతలు స్వీకరించిన శ్రీధర్‌రెడ్డిని గురువారం పులువురు నాయకులు, ఆటో యునియన్ సంఘం సభ్యులు శాలువాతో సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు.

వన్ డిస్ట్రిక్... వన్ ఎగ్జిబిషన్‌కు విద్యార్థిని ఎంపిక

గంభీరావుపేట, ఫిబ్రవరి 15: గంభీరావుపేట మండలంలోని దమ్మన్నపేట ప్రభుత్వ పాఠశాల విద్యార్థిని పొన్నాల వినీల వన్ డిస్ట్రిక్, వన్ ఎగ్జిబిషన్‌కు ఎంపికైంది. స్వాతంత్ర దినోత్సవ వేడుకల్లో భాగంగా రాష్ట్ర వ్యాప్తంగా నిర్వహించిన ఇంటింటా ఇన్నోవేటర్ 2023 కార్యక్రమంలో అద్భుత ప్రతిభ చూపి ఉత్తమ ఇన్నోవేటర్ అవార్డుతో పాటు గ్రామీణ ఇన్నోవేటర్‌గా వినీల అవార్డును అందుకుంది. దమ్మన్నపేట ప్రభుత్వ పాఠశాలలో 9వ తరగతి చదవుతున్న వినీల టీఎస్ఐసీ ఆధ్వర్యంలో 15 నుంచి 17 వరకు మూడు రోజుల పాటు నిర్వహించిన వన్ డిస్ట్రిక్, వన్ ఎగ్జిబిషన్ కార్యక్రమానికి వినీల ఎంపికైంది. మహిళ వంట మిత్ర అనే ఆవిష్కరణను వినీల ప్రదర్శించనుంది.

మండల పరిషత్‌కు డిప్యూటేషన్ల గండం

● కీలక పోస్టుల ఖాళీతో నిలిచిపోతున్న పనులు

● సానిటేషన్ ప్రక్రియకు అవరోధం

కథలాపూర్, ఫిబ్రవరి 15 : మండల పరిషత్ కార్యాలయానికి డిప్యూటేషన్ల గండం పట్టుకుంది. కీలక అధికారులు డిప్యూటేషన్లపై ఇతర ప్రాంతాలకు వెళ్తుండడంతో ఇక్కడ ఖాళీ ఏర్పడి పనులకు ఆటంకం ఏర్పడుతోంది. రాజకీయ నేతలతో పైరవీలు చేయించుకుని పలు మండలాలకు వెళ్లిన క్రమంలో గ్రామాల అభివృద్ధి పడకేసింది. ఈ మండలం నుంచి జీతాలు తీసుకుంటూ ఇతర మండలాల్లో పనిచేస్తుంటే పనులు ఎక్కడికక్కడ నిలిచిపోతున్నాయనే విమర్శలు వస్తున్నాయి. పరిపాలన సౌలభ్యం కోసం డిప్యూటేషన్లపై మండలాలకు పంపుతుండగా స్థానికంగా ఎదురయ్యే ఇబ్బందులు వర్ణణాతీంగా ఉంటున్నాయి. మండల అభివృద్ధి అధికారి తర్వాత పోస్టు ఎంపీవో కాగా ఇక్కడ పనిచేసే ఎంపీవో ప్రవీణ్ కొడిమ్యాలకు డిప్యూటేషన్‌పై వెళ్లాడు. ఆ స్థానంలో ఆదిలాబాద్ జిల్లా నుంచి వచ్చిన గంగాధర్ ఇటీవల అదే జిల్లాకు వెళ్ళగా ప్రస్తుతం ఖాళీగా ఉంది. సూపరింటెండెంట్‌గా పనిచేసిన విజయలక్ష్మీ సారంగాపూర్ మండలంకు డిప్యూటేషన్‌పై వెళ్లారు. ఆ స్థానంలో ఎవరినీ కూడా నియమించలేదు. జూనియర్ అసిస్టెంట్‌గా పనిచేసిన శేఖర్ రాయికల్‌కు డిప్యూటేషన్‌పై వెళ్లాడు. టైపిస్ట్, కంప్యూటర్ ఆపరేటర్లు సైతం డిప్యూటేషన్లపై ఇతర మండలాల్లో విధులు నిర్వర్తిస్తున్నారు. వీరంతా కథలాపూర్ మండలం నుంచే వేతనాలు పొందుతుండడం గమనార్హం. రాజకీయ అండదండలు ఉపయోగించి తమకు అనుకూలమైన స్థానాల్లో డిప్యూటేషన్‌పై వెళ్లారని తెలుస్తోంది. అదేవిధంగా అభివృద్ధి పనుల్లో కీలకంగా ఉంటే పంచాయతీరాజ్ ఏఈ పోస్టు కూడా ఖాళీగా ఉండగా కోరుట్ల ఏఈ ఇన్‌చార్జిగా మూడు సంవత్సరాలుగా కొనసాగుతున్నారు.



మండల పరిషత్ కార్యాలయం

● సానిటేషన్ ప్రక్రియకు అవరోధం

ప్రస్తుతం గ్రామపంచాయతీల్లో ప్రత్యేకాధికారులు కొనసాగుతుండగా మండల స్థాయి అధికారుల పర్యవేక్షణ తప్పనిసరి. అయితే ఎంపీవో, సూపరింటెండెంట్ సానిటేషన్ స్పెషల్ డ్రైవ్‌పై ఎప్పటికప్పుడు పర్యవేక్షణ చేయాల్సి ఉంటుంది. గడిచిన మూడేళ్లుగా డిప్యూటేషన్లపై అధికారులు ఇతర ప్రాంతాల్లో కొనసాగుతున్నాని మండల ప్రజాప్రతినిధులు స్పందించకపోవడం పట్ల సర్వత్రా నిరసన వ్యక్తమవుతోంది.